జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 7 సంచిక 75 | హైదరాబాద్, మే 31 బుధవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

# ఒక్కసారిగా మారిన తెలంగాణ రాజకీయం..

## గుంభనంగా కేసీఆర్.. బీజేపీలో నైరాశ్యం.. టి.కాంగ్రెస్‌లో దూకుడు



హైదరాబాద్: తెలంగాణలో రాజకీయ ముఖచిత్రం మారుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కర్ణాటక ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తెలంగాణలో రాజకీయ సమీకరణల్లో మార్పు మొదలయ్యింది. అప్పటివరకు అధికార భారత రాష్ట్ర సమితి పార్టీని బలంగా ఢీకొనే పార్టీ బిజెపినా? లేక కాంగ్రెస్ పార్టీనా? అన్న చర్చలు కొనసాగాయి. కానీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా రావడం ఒక్కసారిగా తెలంగాణలో పరిస్థితిని మార్చేసింది. కర్ణాటక ఫలితాలను అనుకూలంగా మలుచుకుని తెలంగాణలో వ్యూహానికి పదును పెట్టిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాటల చాతుర్యం ఫలితాన్ని ఇస్తున్నట్లే కనిపిస్తుంది. ముఖ్యంగా భేషజాలను పక్కనపెట్టి అవసరమైతే తనను తిట్టమంటూ పార్టీని వీడిన వాళ్లంతా తిరిగి రావాలని రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా పిలుపునిచ్చారు. దానికి తగినట్లే సామాజిక వర్గ సమీకరణలు ప్రభావితం చేసే రకంగా చర్యలు ప్రారంభించారు. ఇది ఫలితం ఇచ్చినట్టే కనిపిస్తుంది. రేవంత్ రెడ్డికి పార్టీలో ప్రాబల్యం గత నెల రోజుల్లో గణనీయంగా పెరిగింది. మరి ముఖ్యంగా పార్టీని విడి పోయిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నేతలను ఘర్ వాపసీ ద్వారా వెనక్కి పిలవాలన్న రేవంత్ ప్రయత్నం పార్టీలోని ఆయన వ్యతిరేకులను సైతం ఆలోచింపజేసింది. చాలా కాలంగా రేవంత్ రెడ్డిని వ్యతిరేకిస్తూ వస్తున్న నేతలు.. మారిన రేవంత్ మాటల సరళిని ప్రశంసించడం విశేషం.

(మిగతా 2లో..)

# పతకాలను గంగానదిలో కలపకుండా వెనుదిరిగిన రెజ్లర్లు



హరిద్వార్: రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరన్ సింగ్ తమను లైంగికంగా వేధించాడంటూ మహిళా రెజ్లర్లు ఆరోపించినా కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ గత కొన్ని రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నూతన పార్లమెంట్ భవనం ముందు ధర్నా చేసేందుకు రెజ్లర్లు ప్రయత్నించారు.కానీ, పోలీసులు వాళ్లను అడ్డుకున్నారు. అరెస్ట్ చేసి అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఇక తమకు న్యాయం జరుగదని భావించిన రెజ్లర్లు.. ఇన్నాళ్లు తాము గెలుచుకున్న పతకాలను గంగానదిలో కలుపాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు సాయంత్రం ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చేరుకున్నారు. పతకాలను గంగానదిలో పడేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో రెజ్లర్లు అక్కడే ధర్నాకు దిగారు.

# అసద్ కో గుస్సా కైకూ..?

## బీఆర్ఎస్ తో ఎంఐఎంకు చెడిందా!



**కేసీఆర్ తీరును ఎందుకు తూర్పారబట్టారు?**
**ఒంటరిగా పోటీ చేస్తే నష్టమెవరికి?**
**19 చోట్ల పతంగ్ పార్టీకి ఓటు బ్యాంకు**
**విన్నింగ్ ఫ్యాక్టర్ ను డిసైడ్ చేసే చాన్స్**
**పరిణామాలను గమనిస్తున్న కాంగ్రెస్**
**గెలుపోటములపై లెక్కలేసుకుంటున్న బీజేపీ**

హైదరాబాద్ : ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ కి కేసీఆర్ పై కోపమెందుకు వచ్చింది.. ఎందుకలా గొంతు చించుకొని కామెంట్లు చేశారు..? రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ లో ఓ బహిరంగ సభలో పాల్గొన్న అసదుద్దీన్ కేసీఆర్ సర్కారు తీరును తూర్పారా పట్టడం వెనుక వ్యూహం ఏమిటి అన్నది చర్చనీయాంశమైంది.

(మిగతా 2లో..)




## ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు.. ఈడీ ఛార్జిషీట్‌లో కేజ్రీవాల్ పేరు

ఢిల్లీ :ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన నాల్గవ అనుబంధ ఛార్జిషీట్‌లో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేరును చేర్చారు. అయితే.. నిందితుడిగా మాత్రం కాదు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా మారిన అప్రూవర్ దినేష్ అరోరా వాంగ్మూలంతో కేజ్రీవాల్ పేరును ఈడీ అధికారులు ఛార్జిషీట్ లో పొందుపర్చారు. చార్జ్ షీట్‌లో సంజయ్ సింగ్ పేరును కూడా చేర్చారు. 2025లో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం దినేష్ అరోరా ఢిల్లీ డిప్యూటీ మాజీ సీఎం మనీష్ సిసోడియాకు రూ.82 లక్షలు ఇచ్చారని ED పేర్కొంది.

(మిగతా 2లో..)

# రాజరిక వ్యవస్థ తెచ్చేందుకే...

## పార్లమెంట్‌లో రాజదండం: చాడ వెంకటరెడ్డి




కరీంనగర్ : ప్రధాని నరేంద్ర మోదీ నూతన పార్లమెంట్ భవన్‌లో రాజదండం ప్రతిష్ఠించి రాజరిక వ్యవస్థను తీసుకురావడానికి కుట్ర రాజకీయాలకు తెరతీశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. మంగళవారం కరీంనగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగ ప్రకారం దేశం లౌకిక రాజ్యాంగంగా కొనసాగుతున్న తరుణంలో రాజదండంతో బీజేపీ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ ప్రకారం దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రారంభించాల్సి ఉండగా ప్రధాని మోదీ నియంతలా ప్రారంభించారని మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొత్తగా నిర్మించిన పార్లమెంట్‌కు అన్ని పార్టీలతో సమావేశంలో ఏర్పాటు చేసి వారి సూచనల మేరకు ప్రారంభ కార్యక్రమం చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో బీజేపీ కొనసాగిస్తున్న అరాచక పాలనను వ్యతిరేకిస్తూ బీజేపీ హఠావో, దేశ్‌కీ బచావో నినాదంతో సీపీఐ దేశ వ్యాప్తంగా సభలు, సమావేశాలను నిర్వహిస్తుందని వెల్లడించారు.

**బండి సంజయ్ సమాదానం చెప్పాలి**

కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కుమార్ కేంద్రం నుంచి ప్రజలకు అవసరమైన ప్రాజెక్ట్‌లను ఎందుకు తీసుకరావడం లేదో సమాధానం చెప్పాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మత విద్వేషాలు తప్ప ప్రజలకు చేసిందేం లేదన్నారు. ప్రజలు బీజేపీ పాలనతో విసుగు చెందారని, అందుకు నిదర్శనమే కర్ణాటక ఎన్నికల్లో ఓటమి అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ దేశంలో ఎక్కడా గెలిచే అవకాశం లేదని తెలిపారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజల వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడం కోసం జూన్ 4న కొత్తగూడెంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు లక్ష్మి, బాబు, స్వామి తిరుపతి, పైడిపల్లి రాజు, రాజయ్య పాల్గొన్నారు.



## కొనసాగుతున్న హాత్ సే హాత్ జోడో యాత్ర



మధిర: హాత్ సే హాత్ జోడో యాత్ర లో భాగంగా అయ్యవారి గూడెం గ్రామంలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ కమిటీల తో కలిసి జోడో యాత్ర ప్రారంభించారు . ఇంటింటికీ తిరుగుతూ రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన జోడో యాత్ర గురించి వివరిస్తూ... కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు వెంటనే 2 లక్షలు రుణ మాఫీ, ఇందిరమ్మ ఇంటికి 5 లక్షల ఆర్థిక సహాయం రైతు పంటకు గిట్టుబాటు ధర రైతుకు పెట్టుబడికి ఎకరాకు 15000 ఆర్థిక సహాయం రూ: 500 లకే గ్యాస్ సిలిండర్ ఇంకా మరిన్ని పథకాలు ఇస్తుందని ప్రజలకు తెలియజేస్తూ.బిఆర్ఎస్ పార్టీ మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారాన్ని దక్కించుకొని ప్రజల సంక్షేమాన్ని తుంగలో తొక్కారని దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని... డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని,రైతు రుణమాఫీ చేస్తామని మోసం చేశారు.అలాగే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా, ప్రభుత్వ అక్రమాలుతో నోటిఫికేషన్లు రద్దు చేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఇకపై మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని,ప్రతి సంక్షేమ పథకాన్ని కాంగ్రెస్ నిర్వర్తిస్తుందని తెలియజేస్తూ ప్రతి ఇంటికి వెళ్ళి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, పిసిసి సభ్యులు శీలం ప్రతాపరెడ్డి,ఉపాధ్యక్షులు బండారు నర్సింహారావు,శీలం శ్రీనివాస రెడ్డి,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి,వేమిరెడ్డి వెంకట నారాయణ రెడ్డి,నాయకులు కంచర్ల వెంకటనర్సయ్య,అనుమోలు వెంకట కృష్ణారావు,మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జాన్ భాషా,యన్నం పిచ్చిరెడ్డి,పిల్లి బోస్ బాబు, యూత్ నాయకులు సూరంశెట్టి రాజేష్,పార్శపు ప్రసాద్,పొట్టేటి వెంకటనారాయణ రెడ్డి, దేవరకొండ అనీల్ కుమార్,దేవరకొండ వెంకటరత్నం,కోటా వెంకయ్య,కోటా ఆధామ్,మేతుమల్లి భాస్కర్ రావు,ఎం పుల్లయ్య,బి జయరాజు, ఎం మరియన్న తదితరులు పాల్గొన్నారు...

## మహారాష్ట్ర నుండి దేశీదారు మద్యం అక్రమ రవాణా

**టాస్క్ ఫోర్స్ సిఐ సుధాకర్, సిబ్బంది**



ఆసిఫాబాద్ జిల్లా మే30 (ప్రజాపాలన, ప్రతినిధి) : మహారాష్ట్ర నుండి దేశి దారు మద్యం అక్రమ రవాణా చేస్తున్న వారిని జిల్లాలోని కాగజ్ నగర్ ప్రాంతంలో పట్టుకున్నట్లు కుంరం భీమ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు జిల్లాలోని వివిధ గ్రామాలలో దేశీదారు అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు కాగజ్ నగర్ పరిధిలోని మైసమ్మ గుడి ఏరియాలో టాస్క్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ సుధాకర్ తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా మహారాష్ట్రకు చెందిన రెండు కార్లలో వస్తున్న మద్యాన్ని వాహనాలను ఆపి వాటిలో తనిఖీ చేయగా సుమారు 30 కాటన్ లలో 3000, (90 ఎంఎల్) లు వాటి విలువ 1,80,000, గా ఉందన్నారు. అందులో ఉన్న నలుగురు వ్యక్తులను విచారించగా మహారాష్ట్రలోని బల్లర్ష జిల్లా నుండి కొనుగోలు చేసి కొమురం భీం జిల్లాలోని వివిధ గ్రామాలలో అమ్మడానికి తీసుకువచ్చామని తెలిపారు అన్నారు. నలుగురు నిందితులను, వారి వద్ద దొరికిన దేశి దారు కాటన్ లను, రెండు కార్లను, విచారణ నిమిత్తం కాగజ్ నగర్ రూరల్ పోలీస్ వారికి అప్పగించడం జరిగిందని టాస్క్ ఫోర్స్ పోలీస్ సిఐ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఎస్సై సందీప్, ఎస్సై సానియా, సిబ్బంది మధు, రమేష్,శ్రీను, లు పాల్గొన్నారు.

### ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు.. ఈడీ ఛార్జిషీట్‌లో కేజ్రీవాల్ పేరు

(మొదటి పేజీ తరువాయి)

మొదట్లో దినేష్ అరోరా.. సంజయ్ సింగ్‌ను కలిశాడని, అతని ద్వారా మనీష్ సిసోడియాను తన రెస్టారెంట్ అయిన 'అన్‌ప్లగ్డ్ కోర్ట్‌యార్డ్'లో ఒక పార్టీ సందర్భంగా పరిచయమయ్యాడని ఛార్జిషీట్ లో పేర్కొన్నారు ఈడీ అధికారులు. తాను సిసోడియాతో ఐదు, ఆరు సార్లు మాట్లాడానని, సంజయ్ సింగ్‌తో పాటు కేజ్రీవాల్ నివాసంలోనూ ఒకసారి కలిశానని అరోరా చెప్పిన విషయాలను ఛార్జిషీట్ లో వివరించారు ఈడీ అధికారులు. తాను ఆప్‌కి చెందిన విజయ్ నాయర్‌ని కూడా అతని రెస్టారెంట్‌లో కలిశానని, అక్కడ తాము సెల్ ఫోన్ నంబర్లు తీసుకున్నామని అరోరా చెప్పిన విషయాలను ఈడీ అధికారులు ఛార్జిషీట్ లో పేర్కొన్నారు. 2021, ఏప్రిల్ నెలలో ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ గురించి చర్చించడానికి సివిల్ లైన్స్‌లోని ఒబెరాయ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి అరోరాను విజయ్ నాయర్ ను పిలిచారని ఈడీ అధికారులు పేర్కొన్నారు. అరోరాను గౌరీ అపార్ట్‌మెంట్‌కు కూడా నాయర్ ఆహ్వానించాడని తెలియజేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఈడీ ఒక ప్రధాన ఛార్జిషీటును, నాలుగు అనుబంధ ఛార్జిషీట్లను దాఖలు చేసింది.

# ఒక్కసారిగా మారిన తెలంగాణ రాజకీయం..

(మొదటి పేజీ తరువాయి)

తాను ఒక మెట్టు తగ్గడం ద్వారా పార్టీని వీడిన వారిని వెనక్కి ఫలించే ప్రయత్నం చేయడం మంచిదని పార్టీలోని చాలామంది సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలోనూ ప్రభుత్వ వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందని అదంతా కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గుతుందని చాలామంది కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇలా ఉంటే కర్ణాటక ఎన్నిక పలితాలు భారతీయ జనతా పార్టీ నేతల్లో నిరాశను నింపినట్లు ఆ పార్టీకి చెందిన నేతల మాటల్లోనే వ్యక్తం అవుతుంది. బిజెపి చేరికల కమిటీకి సారథ్యం వహిస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దాదాపు చేతులెత్తేసినట్లే కనిపిస్తోంది. దాదాపు ఆరు నెలలుగా ప్రయత్నం చేస్తున్నా కూడా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును తాను బిజెపిలోకి రప్పించలేకపోయానని ఈటల మీడియా ముందు వాపోవడం పరోక్షంగా ఓటమిని అంగీకరించినట్లే. మరో అడుగు ముందుకేసిన ఈటెల.. పొంగులేటి, జూపల్లి తననే పార్టీ మారే రకంగా ప్రోత్సహించారంటూ శల్య మాటలు వర్ణించారు. ఇంకోవైపు తెలంగాణ బిజెపి నేతల్లో మరో కీలక వ్యక్తి ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో బిజెపిది మూడో స్థానమేనని శల్య ప్రకటన చేశారు. వీరిద్దరి మాటలపై బిజెపి అధినాయకత్వం కానీ, బిజెపి రాష్ట్ర నాయకత్వం కానీ స్పందించినప్పటికీ.. వారి మాటలను కూడా ఎవరూ ఖండించకపోవడం గమనార్హం. ఒకవైపు కాంగ్రెస్ పార్టీలో దూకుడు పెరగడం.. ఇంకొక వైపు బిజెపి నేతల మాటల్లో నిరాశ కనిపించడం తెలంగాణలో రాజకీయ సమీకరణలు మారాయి అనడానికి రుజువుగా నిలుస్తున్నాయి.

**తేలిపోయిన ఊహాగానాలు**

నిజానికి బిజెపిలోకి పెద్ద ఎత్తున నేతల వలసలు కొనసాగుతాయని చాలామంది భావించారు. గత ఆరు నెలలుగా దీనికి సంబంధించి ఇప్పుడా అప్పుడా అన్నట్లుగా పరిస్థితి కనిపించింది. కానీ అలాంటి ఊహాగానాలు ఏమీ నిజం కాలేదు. ఫామ్ హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు అంశం వెలుగు చూసిన తర్వాత బిజెపిలో చేరికలు తగ్గిపోయాయి. దానికి తోడు మునుగోడు ఓటమి కూడా ఒకింత కారణమైంది. తాజాగా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బిజెపిలో చేరికలకు పూర్తిగా బ్రేక్ వేసినట్లు కనిపిస్తుంది. కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావం తెలంగాణ మీద ఉండదని కమలనాథులు చెబుతూ వచ్చారు. కానీ తాజా పరిణామాలు వారి మాటల్లో డొల్లతనాన్ని చాటుతున్నాయి. క్రమశిక్షణ కలిగిన భారతీయ జనతా పార్టీ నేతలు పార్టీ పరిస్థితి గురించి, చేరికల గురించి పేలవమైన ప్రకటనలు చేయడం రాష్ట్రంలో ఇప్పుడు చర్చనీయాంశాలుగా మారాయి. తెలంగాణలో కేసీఆర్ పార్టీకి తామే ప్రత్యామ్నాయం అని పలు వేదికలలో చాటిన కమలనాథులు కర్ణాటక ఫలితాలు తర్వాత తమ నోళ్లకు తాళం వేసుకున్నట్లు కనిపిస్తుంది. ఇక గత ఆరు నెలలుగా అటా ఇటా అన్నట్టు ఊరిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రయాణం చివరకు గాంధీ భవన్ వైపేనని తాజా పరిణామాలు చాటుతున్నాయి. ఆయనతోపాటు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం ఖాయమని తెలుస్తోంది. జూన్ 8వ తేదీన పొంగులేటి, జూపల్లి గాంధీభవన్ మెట్లెక్కుతారని సమాచారం. అయితే తమ ఘర్ వాపసీ కార్యక్రమాన్ని గాంధీభవన్‌కే పరిమితం చేయాలా లేక అత్యంత అట్టహాసంగా భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవాలా అన్న విషయంలో ఇంకా సమాలోచనలు జరుగుతున్నట్లు గాంధీభవన్ వర్గాల భోగట్టా.

**షర్మిల చేరితే ప్రయోజనమేనా?**

ఇదిలా ఉంటే సొంత అన్నతో విభేదించి.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను వదిలి తెలంగాణలో రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటూ తండ్రి పేరిట రాజకీయ పార్టీని ప్రారంభించిన వైయస్ షర్మిల కూడా కాంగ్రెస్ పార్టీలో చేరవచ్చు అన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో షర్మిలకున్న సాన్నిహిత్యం.. ఆమెను కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. దానికి తోడు 20 రోజుల వ్యవధిలో షర్మిల రెండు సార్లు శివకుమార్‌ని కలిసి వచ్చారు. తన తండ్రి, దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి మిత్రుడైన శివకుమార్‌ని అభినందించేందుకు మాత్రమే కలిసానని షర్మిల చెబుతున్నప్పటికీ.. వీరిద్దరి భేటీ వెనక రాజకీయ వ్యూహం ఉందన్న వాదన బలంగా వినిపిస్తుంది. ఒకవైపు షర్మిల.. ఇంకోవైపు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ వైపు నిలబడితే ఖమ్మం జిల్లాలోని 10 స్థానాలకు పది స్థానాలను కైవసం చేసుకోవచ్చని తెలంగాణ కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. దానికి తోడు దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు ఉన్న ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలలో షర్మిల ప్రభావంతో కాంగ్రెస్ పార్టీకి మరింత మేలు కలుగుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే షర్మిల తమ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తారా లేక ఎన్నికలకు ముందు పొత్తుకే పరిమితమై ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత విలీనానికి సిద్ధపడతారా అన్నది వేచి చూడాలి. అయితే ఒకవైపు డీకే శివకుమార్‌తో భేటీ అవుతూ వస్తున్న షర్మిల ఇంకోవైపు రేవంత్ రెడ్డిపై వాగ్బాణాలను సంధిస్తున్నారు. దానికి కారణం రేవంత్ రెడ్డి ఆమెని ఉద్దేశించి ఇటీవల చేసిన వ్యాఖ్యలే. ఆమెను ఆడబిడ్డగా గౌరవిస్తామని.. చీరే సారే పెడతామని చెబుతూనే.. షర్మిల రాజకీయాలు ఏపీలో చేసుకుంటే మంచిదని రేవంత్ రెడ్డి కామెంట్ చేశారు. ఆ కామెంట్లపై షర్మిల ఘాటుగానే స్పందించారు. ప్రస్తుతానికి వీరిద్దరి మధ్య మాటల తూటాలు పేలుతున్నప్పటికీ రాజకీయాల్లో ఎప్పుడూ ఏమి జరుగుతుందో చెప్పలేము. పరస్పర ప్రయోజనం ఉంటుందనుకుంటే శత్రువులు.. మిత్రులుగా మారడం రాజకీయాల్లో కొత్తేమీ కాదు.

**ఈ నాలుగు నెలలు కీలకం**

ఒకవైపు బిజెపిలో చేరికలు నిలిచిపోవడం.. ఇంకోవైపు ఆ పార్టీ నేతలే శల్య ప్రకటనలు చేస్తూ వుండడం కమలనాథుల్లో కలవరం రేపుతోంది. ప్రజలకు ఆ పార్టీ వీక్ అయిందన్న సందేశం వెళ్తోంది. దీనిని చక్కదిద్దేందుకు తెలంగాణ బిజెపి నాయకత్వంకానీ, జాతీయ నాయకత్వంకానీ ఇంకా రంగంలోకి దిగకపోవడం ఆశ్చర్యపరుస్తుంది. మరోవైపు కర్ణాటక ఫలితాలు ఇచ్చిన ఉత్సాహంతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు దూకుడు పెంచారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలకు ముందే.. ఇంకా చెప్పాలంటే ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ముగిసిన నాడే కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక వధేరా తెలంగాణ పర్యటనకు వచ్చారు. హైదరాబాద్ సిటీలో యువజన భేరీ నిర్వహించారు. ఆ తర్వాత కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం.. పలువురు నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తూ ఉండడం.. ఆ పార్టీ తెలంగాణ నేతల్లో కొత్త ఉత్సాహం నింపింది. దానికి కొనసాగింపుగా జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లాంటి వారు కాంగ్రెస్ వైపే పయనిస్తుండడం ఇంకాస్త ఉత్సాహాన్నిస్తోంది. ఇదే ఉత్సాహంలో గతంలో కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపి, బీఆర్ఎస్ పార్టీలలో చేరిన కాంగ్రెస్ మూలాలు ఉన్న వారిని తిరిగి రప్పించే ఘర్ వాపసీని వేగవంతం చేయాలని కూడా కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ పరిణామాలను సునిచితంగా పరిశీలిస్తున్న కేసీఆర్.. రెండో స్థానం కోసం ఆ పార్టీలు రెండు పోటీ పడుతున్నాయని.. మొదటి స్థానం మాత్రం తమదేనని పార్టీ శ్రేణులకు సందేశమిస్తున్నారు. ఎన్నికలకు ఇంకా నాలుగు నెలల సమయం ఉంది. ఈ నాలుగు నెలల సమయంలో మూడు ప్రధాన పార్టీలు అనుసరించే వ్యూహాలే చివరి అంకంలో ప్రధాన అస్త్రాలుగా మారబోతున్నాయి.

# అసద్ కో గుస్సా క్యోం..?

(మొదటి పేజీ తరువాయి)


తెలంగాణ ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం పనిచేయడం లేదని, రూ. 1200 కోట్లు ఖర్చు చేసి యాదాద్రి ఆలయాన్ని, బ్రాహ్మణ సదన్ కట్టిన కేసీఆర్.. ఇస్లామిక్ సెంటర్ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. షాదీ ముబారక్ చెక్కులు రావడం లేదని, సెక్రటేరియట్ పూర్తి చేసినా అందులో మసీదు విషయాన్ని గాలి కొదిలేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబర్ లో అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నాయని, ఇప్పటి వరకు తమ ఓట్లతో కేసీఆర్ సీఎం అయ్యారని, అప్పుడు తామేంటో చూపిస్తామన్నారు.

ఇప్పటి వరకు ఓల్డ్ సిటీ కే పరిమితమైన పతంగ్ పార్టీ మహారాష్ట్ర, యూపీ, బిహార్ లలో పోటీ చేసి పలుచోట్ల విజయం సాధించింది. పాత నగరంలో ఏడుగురు ఎమ్మెల్యేలున్న ఎంఐఎం ఈ సారి గ్రేటర్ బయట కాలు పెట్టేందుకు రెడీ అవుతున్నది. తమకు ఓటు బ్యాంకు ఉన్నజూబ్లీహిల్స్?, రాజేంద్రనగర్?, అంబర్? పేట్?, ముథోల్?, నిర్మల్?, ఆదిలాబాద్?, ఖానాపూర్, నిజామాబాద్?, కామారెడ్డి, బోధన్?, కరీంనగర్, జగిత్యాల, మహబూబ్? నగర్?, వరంగల్? ఈస్ట్?, ఖమ్మం సహా పలు నియోజకవర్గాల్లో పోటీకి ప్లాన్? చేసుకుంటోంది. కనీసం 30 అసెంబ్లీ సెగ్మెంట్లలో అభ్యర్థులను నిలిపే ప్రయత్నాల్లో ఆ పార్టీ ముఖ్య నేతలున్నారు. ఇందులో భాగంగానే అసదుద్దీన్ ఒవైసీ ఆదిలాబాద్ లో నిర్వహించిన సమావేశానికి వెళ్లినట్టు తెలుస్తోంది.

ఒంటరిగా పోటీ చేస్తే ఎవరికి ఫాయిదా!

రాష్ట్ర వ్యాప్తంగా 19 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఐఎం ఒంటరిగా పోటీ చేయడం వల్ల ఏ పార్టీకి లాభం చేకూరుతుంది? ఎవరికి నష్టం జరుగుతుందనే అంశంపై విశ్లేషణలు మొదలయ్యాయి. ఎంఐఎం ఒంటరిగా పోటీ చేయడం ద్వారా ముస్లిం ఓట్లు గంప గుత్తగా ఎంఐఎంకు పడితే బీఆర్ఎస్,కాంగ్రెస్ కు నష్టం జరుగుతుంది. ఇదే అదనుగా హిందూ ఓట్లు ఒక వైపే పడితే బీజేపీకి ప్లస్ అయ్యే అవకాశాలెక్కువని విశ్లేషకులు అంటున్నారు. ఎంఐఎం టార్గెట్ చేసిన సెగ్మెంట్లలో కాస్త గట్టిగా వర్క్ చేస్తే బీజేపీకి ఎక్కువ విజయావకాశాలుంటాయని తెలుస్తోంది. మసీదులకు నిధులు, మౌల్వాలకు గౌరవ వేతనం, షాదీముబారక్, ఉర్దూఘర్ ల నిర్మాణం, ముస్లిం రిజర్వేషన్లు లాంటివి అమలు చేసి ఆ ఓటు బ్యాంకుపై కన్నేసిన బీఆర్ఎస్ కు నష్టం జరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంచితే బీఆర్ఎస్ నుంచి దూరమవుతున్న ఎంఐఎంను తమ వైపు తిప్పుకోవడం ద్వారా లబ్ధిపొందాలని కాంగ్రెస్ పార్టీ భావించే అవకాశం ఉంది.


## ఎస్సై, కానిస్టేబుల్ తుది ఫలితాలు విడుదల




తెలంగాణలో కానిస్టేబుల్, ఎస్సై తుది రాత పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. సివిల్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ పోస్టులకు 98,218 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఐటీ, కమ్యూనికేషన్ కానిస్టేబుల్ పోస్టులకు 4564 మంది ఎంపికయ్యారు. సివిల్ ఎస్ఐ పోస్టులకు 43,708 మంది ఎంపికయ్యారు. ఎస్సై ఐటీ అండ్ కమ్యునికేషన్‌కు 729 మంది, డ్రైవర్, ఆపరేటర్ కానిస్టేబుల్ పోస్టులకు 1,779 మంది అర్హత సాధించారు. అలాగే ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులకు 1,153 మంది, పోలీస్ ట్రాన్స్‌పోర్టు ఎస్సై పోస్టులకు 463 మంది, పోలీస్ కానిస్టేబుల్ మెకానిక్‌కు 283 మంది ఎంపికయినట్టు రిక్రూట్‌మెంట్ బోర్డు పేర్కొంది. ఈరోజు రాత్రి నుంచి అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలు వెబ్‌సైట్ లో పెడతామని రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. ఫైనల్ కీ, ఓఎంఆర్ షీట్లు వెబ్ సైట్ లో తమ వ్యక్తిగత లాగిన్ లో చూసుకోవచ్చని పేర్కొంది.

## ఉద్ధవ్ శివసేనలో తీవ్ర అశాంతి...

**ఫడ్నవిస్ సంచలన వ్యాఖ్యలు**



ముంబై: ఉద్ధవ్ థాకరే సారథ్యంలోని శివసేనపై బీజేపీ సీనియర్ నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మంగళవారంనాడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముగ్గురు నలుగురు వ్యక్తుల కారణంగా ఉద్ధవ్ థాకరే శివసేనలో తీవ్ర అశాంతి నెలకొందని అన్నారు. ఆ వ్యక్తులెవరనేది ఆయన చెప్పడానికి నిరాకరించారు. త్వరలోనే ఆ విషయాలు బయటకు వస్తాయని, అందరికీ తెలుస్తుందని, ఇప్పుడే దాని గురించి తాను మాట్లాడటం సరికాదని మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. శివసేన పార్టీ పత్రిక 'సామ్నా'లో వచ్చిన సంపాదకీయంపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఫడ్నవిస్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**'సామ్నా' ఏమి చెప్పింది?**

ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన 22 మంది ఎమ్మెల్యేలు, తొమ్మిది మంది ఎంపీలు తమతో సంప్రదింపులు సాగిస్తున్నట్టు 'సామ్నా' సంపాదకీయ పేర్కొంది. బీజేపీ అనుసరిస్తున్న సవతి తల్లి వైఖరితో ఈ 22 మంది ఎమ్మెల్యేలు, 9 మంది ఎంపీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, షిండే వర్గంలోని మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు అనిశ్చితితో కొట్టుమిట్టాడుతున్నారని ఆ సంపాదకీయం రాసింది.ఆసక్తికరంగా, శివసేన వ్యవస్థాప దినోత్సవం జూన్ 19న జరగనుండటంతో ఇటు షిండే వర్గం శివసేన, ఉద్ధవ్ థాకరే వర్గం తమ బలాన్ని ప్రదర్శించుకునేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలో పూర్తి చేయాలి



హైదరాబాద్ 30 వే ప్రజాపాలన:సంగారెడ్డి జిల్లా రెవెన్యూ కావనీ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలో పూర్తి చేయాలని కాలనీ వానులు కోరుతున్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీ వరిధిలో రెవెన్యూ కాలనీలో ప్రగతి లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల మూలంగా రోడ్డు మీద మట్టి వేయడం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది . డ్రైనేజీ పనులను త్వరగా పూర్తిచేసి రోడ్డు సౌకర్యం కల్పించాలని రెవెన్యూ కాలనీ వాసులు కోరుతున్నారు.

## మూడు వెర్షన్లలలో వందేభారత్



ముంబై, మే 30, : వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టడంతో, భారతదేశం కొత్త శకంలోకి ప్రవేశించింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణీకుల అనుభవాన్ని మెరుగుపరిచింది. ఈ కొత్త శకం రైళ్లను ప్రవేశపెట్టడంతో, భారతీయ రైల్వేలు వందే భారత్ రైళ్లలో గణనీయంగా మెరుగైన కొత్త వెర్షన్‌లను త్వరలో పరిచయం చేయనుంది. ఇండియన్ రైల్వే 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశీయ సెమీ-హై స్పీడ్ వందే భారత్‌లో మరో రెండు వెర్షన్‌లను పరిచయం చేయబోతున్నాయి. రైలు నీలం- తెలుపు రంగుల రెండు వెర్షన్లు ఫిబ్రవరి 2024 నాటికి ప్రారంభించనున్నారు. ఈ కొత్త యుగం రైళ్ల ప్రవేశంతో భారతీయ రైల్వే మైలురాయిని చేరుకోనుందనడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం దేశంలో వందే భారత్‌కు ఒకే ఒక్క వెర్షన్ ఉంది. వందే చైర్ కార్. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండు కొత్త ఎడిషన్లను ప్రవేశపెట్టాలని రైల్వే యోచిస్తోంది. అవి వందే మెట్రో, వందే స్లీపర్ రైళ్లు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణీకుల అనుభవాన్ని మెరుగుపరిచింది. రాజధాని, శతాబ్ది, లోకల్ రైళ్ల స్థానంలో ఈ రైళ్లను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం, మూడు వెర్షన్లు చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ లో తయారు చేస్తున్నారు. ఇండియన్ రైల్వేలు మూడు వేర్వేరు మార్గాల్లో వందే భారత్ విభిన్న సంస్కరణలను నిర్వహిస్తాయి: (1) వందే భారత్ చైర్ కార్ - వందే భారత్ చైర్ కార్ వెర్షన్ 100 కి.మీ నుండి 550 కి.మీ వరకు నడుస్తుంది. (2) వందే మెట్రో - వందే మెట్రో 100 కిలోమీటర్ల కంటే తక్కువ దూరం వరకు నడుస్తుంది. (3) వందే స్లీపర్ కార్ - వందే స్లీపర్ కార్ ఫార్మాట్ 550 కిమీ కంటే ఎక్కువ ప్రయాణానికి నిర్వహించబడుతుంది. వందే మెట్రో, వందే స్లీపర్ డిజైన్ ఎప్పుడు అమలులోకి వస్తాయి? ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి అంటే ఫిబ్రవరి లేదా మార్చి 24 నాటికి వందే మెట్రో, వందే స్లీపర్ వెర్షన్‌లను ప్రవేశపెట్టాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల, ముంబైలోని సబర్బన్ రైళ్లను వందే మెట్రో వెర్షన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. వందే మెట్రో ప్రారంభం రోజువారీ ప్రయాణికులకు సురక్షితమైన, సమర్థవంతమైన, వేగవంతమైన ప్రయాణాలను అందిస్తుంది

# గెలుపు గుర్రాలకే సీట్లు..

హైదరాబాద్, మే 30, :తెలంగాణ రాష్ట్రంలో మరో నాలుగైదు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి ఎన్నికలలో ఎలాగైనా విజయం సాధించి మళ్లీ అధికారాన్ని చేపట్టాలని భావిస్తున్నారు సీఎం కేసీఆర్. ఈ క్రమంలో ఇప్పటినుంచే వ్యూహాత్మకంగా ఎన్నికలకు ఎలా వెళ్లాలి అన్న దానిపై అడుగులు వేస్తున్నారు. ఇదే సమయంలో ఈసారి టికెట్లు ఎవరికి ఇస్తే గెలుస్తారు అన్న దానిపైన కూడా సర్వేలు చేయించి, గెలుపు గుర్రాల కు మాత్రమే టికెట్లు ఇవ్వాలని కెసిఆర్ నిర్ణయించారు. ఈసారి ఎన్నికలలో కొత్త, యువ అభ్యర్థులను బరిలోకి దింపి ప్రయోగాలు చేయడం సీఎం కేసీఆర్ కు ఏ మాత్రం ఇష్టం లేదు. ప్రజాక్షేత్రంలో మంచి పేరు, అనుభవం ఉన్న నాయకులకు పెద్దపీట వేసి టిక్కెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయం బీఆర్ఎస్ పార్టీలో చాలామంది నేతలకు మింగుడు పడడం లేదు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో రెండుసార్లు ప్రజలు ఆదరించారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి చాలామంది కీలక నాయకులు తమ వారసులకు టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈసారి వారికి టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదని సీఎం కేసీఆర్ తేల్చి చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తన కుమారుడికి టికెట్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ ను కోరగా, కెసిఆర్ ఈసారికి పోచారం శ్రీనివాస్ రెడ్డి మాత్రమే పోటీ చేయాలని తేల్చి చెప్పారని సమాచారం. ఈసారి వారసులకు టిక్కెట్లు ఇచ్చే ఆలోచన లేదని ఆయన స్పష్టంగా చెప్పడంతో తమ పిల్లలకు టికెట్ కావాలని ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు ఖంగు తిన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తదితరులు ఈ సారి తమ వారసులకు టికెట్ ఇవ్వాలని అధినేత దృష్టికి తీసుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పలువురికి సీఎం కేసీఆర్ వారసులకు ఈ సారి ఎన్నికల్లో నో ఛాన్స్ అని తేల్చి చెప్పేసినట్టు సమాచారం. కెసిఆర్ నిర్ణయంతో ఈసారి ఎన్నికలలోనైనా తమ వారసులని రాజకీయాల్లోకి దింపాలని ప్రయత్నం చేస్తున్న పలువురు కీలక నేతలకు దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయింది

15 మంది ఎవరు...

వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి.. హ్యాట్రిక్ ను అందుకోవాలని టీఆర్ఎస్ ప్రయత్నిస్తూ ఉంది.



ముఖ్యంగా అభ్యర్థుల విషయంలో చాలా ప్రణాళికలను రచిస్తూ ఉంది. ఎమ్మెల్యే అభ్యర్థుల విషయంలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ దూకుడుగా వ్యవహరిస్తూ ఉన్నారు. సర్వేలు, నిఘా వర్గాల సమాచారం తీసుకుని సీఎం కేసీఆర్ అభ్యర్థులకు సంబంధించి మార్పులు చేయాలని భావిస్తూ ఉన్నారు. 'మీ అంతట మీరు పొర పాట్లు చేస్తే తప్ప.. ఈసారి ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్యే లెవరినీ మార్చే ఉద్దేశం లేదు' అంటూ సీఎం ఇటీవల చెప్పారని తెలుస్తోంది. అయితే క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని కూడా సీఎం కేసీఆర్ పరిశీలిస్తూ ఉన్నారు. పనితీరు సరిగా లేని వారిని ఆయన పిలిచి హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంపై పూర్తిగా దృష్టి పెట్టని వాళ్లపై కేసీఆర్ ఓ కంటకనిపెడుతూ ఉన్నారు. నియోజకవర్గంలో ఉండకుండా.. ఎక్కువ కాలం బయటే గడుపుతున్న వాళ్లను ఆయన పిలిచి మరీ మందలించినట్లు తెలుస్తోంది. తీరు మార్చుకోకుంటే నిర్ణయం మరోలా ఉంటుందని సీఎం ఇప్పటికే కొందరికి పిలిపించి చెప్పినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఓ15 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల విషయంలో ప్రజలు ఏ మాత్రం ఆసక్తి కనబరచలేదని కేసీఆర్ కు సమాచారం రావడంతో వాళ్లను పక్కన పెట్టేయాలని కేసీఆర్ భావిస్తూ ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే తన నియోజకవర్గంపై పూర్తిగా దృష్టి సారించకపోవడంతో ఆయన్ను హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన కొందరి విషయంలో కూడా కేసీఆర్ దూకుడుగా వ్యవహరిస్తూ ఉన్నారు. స్థానికంగా పట్టు లేకపోతే కష్టమే అని ఆ నాయకులకు కేసీఆర్ సూచించారు. వచ్చే ఎన్నికల్లో కొందరు నాయకులు తమ కుమారులకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా లేరని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పలువురు బడా నాయకులు తాము మాత్రమే కాకుండా.. తమ కుమారులకు కూడా టికెట్లు ఇవ్వాలని కోరారని.. అందుకు కేసీఆర్ ఒప్పుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఆయా నాయకులు తప్పుకుని తమ కుమారులను గెలిపించుకోవాలని అనుకుంటే మాత్రం ఆలోచించి నిర్ణయం చెబుతామని చెప్పినట్లు కూడా విశ్వసనీయ వర్గాల సమాచారం. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తన కుమారుడి కోసం ప్రయత్నించగా.. కుదరదని అధినేత చెప్పినట్లు తెలిసింది. ఇలా పలువురు నాయకులు తమ వారసుల విషయంలో బీఆర్ఎస్ అధినేత వద్ద చెప్పుకొన్నారు.. కానీ ఆయన నుండి గ్రీన్ సిగ్నల్ అయితే రాలేదు.

# నకిలీ అధికారులను పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్, మే 30, : సూర్య, కీర్తి సురేష్, రమ్యకృష్ణ ప్రధాన పాత్రలుగా నటించిన సినిమా 'గ్యాంగ్'. ఈ సినిమాలో నకిలీ ఐడీలు సృష్టించి.. తాము ఆదాయపు పన్ను శాఖ అధికారులమంటూ సోదాలు చేపడతారు ఈ దొంగల ముఠా. సేమ్ అదే సీన్ తరహాలో జరిగింది సికింద్రాబాద్‌లో. శనివారం పట్టపగలు తాము ఐటి అధికారులమంటూ చెప్పి ఓ గోల్డ్ షాపులోకి వెళ్లి తనిఖీలు చేపట్టింది ఓ గ్యాంగ్. అనంతరం రెండు కేజీల బంగారు నగలతో ఉడాయించింది. ఆ గ్యాంగ్ ను పోలీసులు ?రెస్ట్ చేశారు. సికింద్రాబాద్ లోని పాట్ మార్కెట్ బంగారు దుకాణంలో జరిగిన దోపిడీ ఘటనలో చోరీకి పాల్పడిన నిందితులు జాకీర్, రహీమ్, ప్రవీణ్, అక్షయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చోరీ చేసిన అనంతరం నిందితులంతా మహారాష్ట్రకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడకు వెళ్లి వారిని పట్టుకున్నారు. మరో నలుగురి కోసం గాలింపు కొనసాగుతున్నట్లు తెలిపారు. దోపిడీకి పాల్పడిన ముఠాలో మొత్తం 8 మంది ఉన్నట్లు సమాచారం. నాలుగు నెలల క్రితమే మహారాష్ట్రకు చెందిన రివెన్ మధుకర్ ఈ షాపును పెట్టాడని, మధుకర్ సొంతూరు వెళ్లగా..షాపును బావమరిదికి అప్పగించిన సమయంలో ఈ ఘటన జరిగింది. సోషల్ మీడియా ప్రభావమో, సినిమా ప్రభావమో కానీ.. ఈ దొంగతనాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. వీరి ఆగడాలు మాత్రం రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. మారు వేషాల్లో దర్జాగా వచ్చి దోచుకుంటున్నారు. నకిలీ పోలీస్ ఆఫీసర్లు, అధికారులు, దొంగ బాబా వేషాలు వేసి.. సినిమా రేంజ్‌లో నటించి దోపిడీలకు పాల్పడుతున్నారు. చివరకు వచ్చింది నకిలీ అధికారులు అని తెలుసుకుని.. లబోదిబోమంటున్నారు. ఇవే సినిమాలకు ప్రేరణ అవుతున్నాయో, సినిమాలను చూసి ఇలా తయారయ్యారో తెలియడం లేదు. అచ్చంగా ప్రొఫెషనల్స్ మాదిరిగా వ్యవహరించి దోపిడీలకు పాల్పడుతున్నారు. తాము ఐటి అధికారులమనీ, బంగారం కొనుగోలులో అవకతవకలకు పాల్పడ్డారన.. కొంచెం సేపు తనిఖీ చేస్తున్నట్లు నటించి..విలువైన వస్తువులతో ఉడాయిస్తున్నారు. సాధారణంగా ఐటీ అధికారులు నేరుగా సోదాలు చేయరు. ముందుగా నోటీసులు ఇస్తారు. కానీ అలాంటి నోటీసులేమీ రాకపోవడంతో వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. సొమ్ములు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్ కు రావాలని తీసుకెళ్లిపోతున్నారు. బాధితులు స్టేషన్ వద్దకు వెళ్తే కానీ దొంగతనం జరిగిందని గుర్తించలేకపోతున్నారుబంగారు దుకాణాలు, ఇతర చోట్ల అత్యధికంగా లెక్కలోకి రాని వ్యవహారాలు జరుగుతూ ఉంటాయి.దీంతో బంగారం లేదా.. ఇతర నగదు దోచుకుంటే వారు పోలీసులకు ఫిర్యాదు చేయరన్న అభిప్రాయం ఉంది. అందుకే దొంగలు ఇలాంటి వ్యాపారుల్ని టార్గెట్ చేస్తారని అంచనా వేస్తున్నారు

# విద్యుత్తు వైర్ చోరీ - యేళ్ళు గడిచినా దొరకని దొంగలు...

**వైర్ దొంగతనంతో నాటి నుంచి నేటివరకు అందని విద్యుత్ సరఫరా...**

**విద్యుత్ వైర్ చోరీల వరుస కథనాలకు నేటికీ పరిష్కారం శూన్యం.**

**న్యాయం కోసం లబ్ధిదారుల పోరాటం...**




యాదాద్రి- భువనగిరి( ప్రజాపాలన ప్రతినిధి):విద్యుత్తు వైర్ చోరీ జరిగి యేళ్ళు గడిచినా నేటివరకు దొంగలు దొరకక పోగా వైర్ దొంగతనం జరిగిన నాటినుండి నేటి వరకు విద్యుత్ సరఫరా అందక లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్న ఘటన యాదాద్రి- భువనగిరి జిల్లా చోటుచేసుకుంది.రెండేళ్ల క్రితంమోటకొండూర్ మండలం మాటూరు గ్రామంలో నవంబరు నెల 2021 సంవత్సరం లో జరిగిన భారీ విద్యుత్ వైర్ (కండక్టర్) చోరి జరిగిన విషయం తెలిసిందే.ఈ భారీ చోరి జిల్లా లో అప్పట్లో సంచలనం సృష్టించింది.రెండు సంవత్సరాల కాలం పూర్తి అయినప్పటికీ విద్యుత్ వైర్ చోరీ చేసిన దొంగలను పట్టుకోలేక పోయారని పరిష్కారం మాత్రం లభించలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేశారు. విద్యుత్తు వైర్ దొంగిలించిన మరుసటి రోజున కూడ 5 కరెంట్ స్తంభాల వైర్ ను కత్తిరించడం జరిగిందని బాధితులు తెలిపారు.ఈ విషయాన్ని బాధితులు సంబంధిత అధికారులకు, స్థానిక పోలీసులకు అప్పట్లో సమాచారం అందించారు. స్పందించిన మోటకొండూర్ మండలం పోలీస్ బృందం 2021 నవంబరు నెల బుధవారం రోజు మధ్యాహ్నం మాటూరు గ్రామంలో విచారణ జరిపారు.

**మోటకొండూర్ మండలం పోలీస్**

**సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు, కానిస్టేబుల్ రమేశ్,**

స్థానిక నాయకులు స్కైలాబ్ రెడ్డి, తాల్క కుమార స్వామి, తాల్క శ్రీకాంత్ తదితరులు విద్యుత్ వైర్ చోరీ కి గురైన సర్వే నంబర్ 175 లోని సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. చోరి జరిగిన విషయాన్ని స్థానిక నాయకులను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.విద్యుత్ వైరును దొంగిలించడం మూలంగా విద్యుత్తు సర్వీస్ నెంబరు 816 తో గల వ్యవసాయ బోరు బావికి కరెంట్ సరఫరా 2021 నుండి నిలిచిపోయిందని బాధితులు తమ ఆవేదన మీడియాకు వ్యక్తంచేశారు. దాదాపు 4 కరెంట్ స్తంభాలకు సరిపడే వైరును (కండక్టర్) దుండగులు అపహరించిన విషయం నిర్ధారించారు. ఇలాంటి దొంగతనాలు విద్యుత్ శాఖలో పనిచేసే సిబ్బంది సహకారం తోనే జరిగే అవకాశం ఉందని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. 11కె.వి.విద్యుత్ సరఫరా జరుగుతుండగా విద్యుత్ సిబ్బంది సహకారంతో లైన్ క్లియర్ తీసుకోకుండా జంపర్లను కత్తిరించడం మామూలు దొంగలకు సాధ్యం కాదని విద్యుత్ శాఖ పైన అవగాహన ఉన్న నిపుణులు చెబుతున్నారు. విద్యుత్ శాఖలో క్షుణ్ణంగా విచారణ జరపాలని గతంలో పోలీస్‌లను పలువురు డిమాండ్ చేశారు. జరిగిన విషయాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి పంచనామా జరిపినట్లు తెలిపారు.అతి త్వరలో దొంగలను పట్టుకుని చోరికి గురైన సొమ్మును స్వాధీనం చేసుకుంటామని గతంలో పోలీసులు లబ్దిదారులకు హామీ ఇచ్చారు కానీ రెండు సంవత్సరాలు అయినా కేసు పరిష్కారం జరగలేదని పలువురు అభిప్రాయపడు తున్నారు.రెండు సంవత్సరాల కాలం పూర్తి అయినప్పటికీ విద్యుత్ వైర్ చోరీ కేసును తేల్చుకోలేక పోయారని లబ్దిదారులు ఆవేదన వ్యక్తంచేశారు ఇప్పటికైనా ట్రాన్స్ కోపై అధికారులు,పోలీసు ఉన్నతాధికారులు అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి రెండు సంవత్సరా ల నుండి పెండింగ్లో ఉన్న కేసును పరిష్కరించి తమకు న్యాయం చేయా లని లబ్ది దారులు పత్రికా ముఖంగా కోరారు.

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 31, మే 2023

## అవినీతిపరులతో న్యాయం అనాథ!

సమాజంలో శాంతి ఉండాలంటే ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉండాలి. న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరగాలంటే న్యాయమూర్తులు నీతి నిజాయితీలకు కట్టుబడి ఉండాలి. ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులు పదవిని స్వీకరించే సమయంలో 'మేం ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా, రాగద్వేషాలు లేకుండా, భయం పక్షపాతం లేకుండా తీర్పులు చెప్తాం' అని ప్రమాణం చేస్తారు. కానీ ఆ ప్రమాణానికి ఆచరణలో విలువ ఇచ్చే న్యాయమూర్తులు తగ్గుతున్నారేమో అనిపిస్తోంది. ఇటీవలే సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ అబ్దుల్ నజీర్ గారిని పదవీ విరమణ చేసిన 40 రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వ సలహా మేరకు ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా రాష్ట్రపతి నియమించారు. ఈయన 2019లో సుప్రీంకోర్టు విలువరించిన అయోధ్య రామ మందిర కేసులో తీర్పు చెప్పిన ఐదుగురు జడ్జిల బెంచిలో ఒకరు. ఆ కేసులో కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ వైఖరికి అనుకూలంగా ఇచ్చిన తీర్పుకు ప్రతిఫలంగానే ఇప్పుడు ఆయనకు గవర్నర్ పదవి ఇచ్చారని ఆరోపణలు వస్తున్నాయి. ఇదే కేసులో ప్రభుత్వ పక్షానికి అనుకూలమైన తీర్పు చెప్పిన అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గోగయ్‌ను ఆయన పదవీ విరమణ చేసిన నాలుగు నెలలలోపే కేంద్రంలోని అధికార పార్టీ రాజ్యసభ సభ్యుడిని చేసింది. అదే కేసులో తీర్పు చెప్పిన మరో జడ్జి జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే ఆ తర్వాత మహారాష్ట్ర నేషనల్ యూనివర్సిటీ ముంబై, నాగపూర్ యూనివర్సిటీలకు వైస్ చాన్సలరుగా నియమితులయ్యారు. అదేవిధంగా జులై 2021లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ అశోక్ భూషణ్ నాలుగు నెలల లోపే నేషనల్ కంపెనీ అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబరుగా నియమితులయ్యారు. గతంలోనూ ఇటువంటి ఆరోపణలు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. 1984 సిక్కుల ఊచకోత కేసులో ఎంక్వయిరీ కమిషన్ చైర్మనుగా వ్యవహరించిన జస్టిస్ రంగనాథ్ మిశ్రా అధికార పక్షానికి అనుకూలంగా నివేదిక ఇచ్చాడని, అందుకు ప్రతిఫలంగానే ఆయనను రాజ్యసభ సభ్యునిగా నియమించారని ఆరోపణలు ఉన్నాయి. షాబుద్దీన్ ఎన్‌కౌంటరు కేసులో జస్టిస్ సదాశివమ్ అమిత్ షాకు అనుకూలంగా తీర్పు చెప్పినందున ఆయనను కేరళ గవర్నరుగా నియమించారనే ఆరోపణ ఉంది. నేడు శాసన, కార్యవర్గ విభాగాలపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిపోయింది. ఎన్నికల్లో బాగా డబ్బు ఖర్చు పెట్టగలిగిన పార్టీలు, అభ్యర్థులు మాత్రమే గెలవగలుగుతున్నారనేది కఠోర సత్యం. ఎన్నికైన పార్లమెంటు శాసన సభ్యులలో దాదాపు 40శాతం మంది మీద క్రిమినల్ కేసులు ఉన్నాయనేది మరో వాస్తవం. అలాగే కార్యనిర్వాహక వర్గంలోని ఉన్నతాధికారులు రాజకీయ నాయకుల చెప్పుచేతల్లో నడుస్తున్నారనేది జన వాక్యం. ఇక మిగిలినది న్యాయవ్యవస్థ. ఎక్కడ న్యాయం లభించకపోయినా న్యాయస్థానం తలుపులు తడితే న్యాయం జరుగుతుందని ఎంతోమంది ప్రజలు ఇంకా నమ్ముతున్నారు. ఆ వ్యవస్థ కూడా అవినీతి పంకిలం పాలైతే ఇక ప్రజాస్వామ్యానికి విలువే లేకుండా పోతుంది. న్యాయం అమ్ముడుపోయే వస్తువు కావడం అంతటి హీనస్థితి మరొకటి లేదు. నిజానికి న్యాయమూర్తులు పదవీ విరమణ చేసిన తర్వాత వారికి న్యాయ సంబంధమైన పదవులు ఎన్నో ఉంటాయి. లోక్‌పాల్, లా కమిషన్ చైర్మన్, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, నేషనల్ కన్స్యూమర్ ఫోరం, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ట్రిబ్యునల్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, జాతీయ మానవ హక్కుల కమిషన్, అదే విధంగా రాష్ట్ర స్థాయిలో లోకాయుక్త కన్స్యూమర్ ఫోరం, మానవ హక్కుల కమిషన్ లాంటివి ఉంటాయి. ఇటువంటి పదవులలో కొన్నింటిని ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు లేదా ఆయా రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తులు పంపిన పేర్ల నుంచి నియమిస్తారు. కొన్ని పదవులను ప్రభుత్వాలే భర్తీ చేస్తాయి. న్యాయమూర్తులు, ప్రధాన న్యాయమూర్తులు పేర్లు పంపినప్పటికీ అంతిమ నిర్ణయం ప్రభుత్వానిదే. ఇటువంటి పదవులు అన్నిట్లోనూ ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన గల కమిటీ నిర్ణయమే అంతిమ నిర్ణయంగా ఉండాలి. అయితే ఈ కమిటీల్లో ప్రభుత్వం వైపు నుంచి ఒకరిద్దరు సభ్యులుగా ఉండవచ్చు. మెజారిటీ న్యాయమూర్తులదే ఉండాలి. అంటే ప్రధాన న్యాయమూర్తి సూచనలను పక్కనపెట్టే హక్కు ఇటువంటి పదవులను భర్తీ చేయడంలో ప్రభుత్వానికి ఉండకూడదు. న్యాయమూర్తిగా నాకున్న చిన్న అనుభవంలో ఎంతో మంది సీనియర్ న్యాయమూర్తులను చూశాను జస్టిస్ పి. వెంకట్రామరెడ్డి, జస్టిస్ సయ్యద్ షా ముహమ్మద్ ఖాదిరి, జస్టిస్ సింగ్వీ, జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ ఎ. లక్ష్మణరావు, జస్టిస్ కళ్యాణ్ సేన్ గుప్తా, జస్టిస్ పర్వతరావు లాంటి ఎంతోమంది న్యాయమూర్తులు గొప్ప పేరు తెచ్చుకున్నారు. వారు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు వారి కోసం టిఫిన్, భోజనాలు మొదలైనవి తెప్పించినప్పుడు వాటికి అయిన ఖర్చు డబ్బులు వెంటనే వారు చెల్లించేవారు. నేను ప్రకాశం జిల్లా జడ్జిగా ఒంగోలులో పనిచేస్తున్నప్పుడు ఒకసారి జస్టిస్ సింగ్వీ అక్కడికి వచ్చారు. ఆయనకు డ్రై ఫ్రూట్స్, టిఫిన్ ఏర్పాటు చేశాం. ఆయన వెంటనే 'ఇది ఎలా తెచ్చారు' అని అడిగారు. నేను పది నిమిషాల సమయం అడిగి వాటిని కొన్న బిల్లులు తెచ్చి చూపాను. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో ఇటువంటి ఖర్చుల కోసం కోర్టు సిబ్బంది, న్యాయవాదుల వద్ద డబ్బులు తీసుకుంటారు. అందుకే జస్టిస్ సింఘ్వీ ఇవి ఎలా తెచ్చారని నన్ను అడిగారు. అలాంటి న్యాయమూర్తులు ఉంటే మిగతా న్యాయమూర్తులకు ఆదర్శవంతులు అవుతారు. సాధారణంగా ఒక జడ్జి ఒక కోర్టు నుంచి మరో కోర్టుకు బదిలీ కాగానే అతను ఎటువంటి వ్యక్తి అనేది న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అంచనా వేస్తారు. అతనికి ఏర్పాటు చేసిన టిఫిన్‌కు, భోజనాలకు, గెస్ట్ హౌసుకు అతనే డబ్బులు చెల్లిస్తున్నాడా లేదా అని గమనిస్తారు. జడ్జి గారికి కొంతమంది మామిడిపళ్ళ గంపలు మొదలైనవి పంపుతారు. పోలీసులు ప్రయాణానికి వాహనాలు ఏర్పాటు చేస్తారు. డబ్బులు ఇస్తున్నారా, ఇవ్వడం లేదా అని గమనిస్తారు. కొంతమంది జడ్జిలు సతీసమేతంగా గుడులకు గోపురాలకు వెళ్ళినప్పుడు వారి భార్యలకు పట్టుచీరలు మొదలైనవి బహుకరిస్తారు. ఈ సందర్భాల్లో అడుగడుగునా జడ్జీల ప్రవర్తన ఎలా ఉందన్నది అందరూ పరిశీలిస్తుంటారు. వీటిని బట్టే ఆ జడ్జీ నిజాయితీ కలవాడా, లేక ప్రలోభాలకు లొంగేవాడా అన్నది అంచనా వేస్తారు. నిజాయితీగా ఉంటే ఎవరూ ఏమీ చేయలేరు. పైన ప్రస్తావించిన సందర్భాలను గమనించినట్లయితే ఇటీవల చాలామంది జడ్జీలు ప్రలోభాలకు లొంగుతున్నట్లు కనబడుతున్నది. ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలైన మూడు వ్యవస్థలలో ప్రజలు ఇంకా విశ్వసిస్తున్న ఒకేఒక్క న్యాయ వ్యవస్థకు న్యాయమూర్తులే ప్రాణం. వారు కూడా ప్రలోభాలకు లొంగితే ఇక ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుంది.

## బీసీలకు బీజేపీ రాజకీయ అవకాశం కాదాదు!




తెలంగాణలోని కాపులు, పెద్ద బీసీ కులాలు బీజేపీ జాతీయవాదాన్ని ఒక రాజకీయ అవకాశంగా తీసుకుని రాష్ట్రంలో రాజకీయంగా ఎదగాలన్న నిర్ణయానికి వచ్చినట్టు కనిపిస్తోంది. ఈ రకమైన ఆలోచన తెలుగు రాష్ట్రాల్లో కొత్తదేమీ కాదు. గతంలో ఆయా ఆధిపత్య కులాలు ఏదో ఒక వాదాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయంగా బలపడ్డాయి. ఆధునిక రాజకీయాలు మొదలయ్యాక ఆంధ్ర-తెలంగాణలోని రెడ్డి కులస్థులు తెలుగు ప్రజల ఐక్యత నినాదంతో విశాలాంధ్రలో తమ రాజకీయ ఆధిపత్యాన్ని స్థాపించుకున్నారు. కమ్మ కులస్థులు 1982లో తెలుగుజాతి ఆత్మగౌరవం నినాదంతో రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అదనుకోసం ఎదురు చూస్తున్న వెలమ కులస్థులకు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరంగా లభించింది. తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను తమ నాయకత్వంలో తెచ్చుకుని కొత్త రాష్ట్రంలో రాజకీయ శక్తిగా ఎదిగారు. తరువాత వరుసలో ఉన్న కాపు, పెద్ద బీసీ కులాలు రాజకీయ అవకాశం కోసం ఎదురుచూస్తున్నాయి. ఆర్థికంగా బలపడిన ఈ కులాలు రాజకీయంగా ఎదగాలని అనేక ప్రయత్నాలే చేశాయి. బీసీ కులాల్లోని అనైక్యత, ఆధిపత్యకులాల కుట్రలు వారి రాజకీయాల్ని మొగ్గలోనే తుంచేశాయి. ఇప్పుడు ఈ బీసీ కులాలు బీజేపీ జాతీయవాదాన్ని ఒక రాజకీయ అవకాశంగా చూస్తున్నాయి. అయితే ఈ ఆలోచన అనేక ప్రశ్నలను లేవదీస్తున్నది. తెలంగాణ సాయుధ పోరాటంలోను, తదనంతరం జరిగిన నక్సలైట్, ఇతర ప్రజా ఉద్యమాల్లో చిన్నా పెద్దా బీసీ కులాలకు ప్రధాన భూమిక పోషించిన చరిత్ర ఉంది. మరి ఈ చరిత్ర ఉన్న బీసీలు, వారిలోని కొందరు ధనికులు చెప్పే బీజేపీ జాతీయవాదాన్ని స్వాగతిస్తారా? కాపు, పెద్ద బీసీ కులాలతో మిగతా బీసీ కులాలు నడుస్తాయా? ఎందుకంటే బీజేపీ ఒక జాతీయ రాజకీయ పార్టీగా చలామణి అవుతున్నప్పటికీ, అది ఒక మతతత్వ భావజాలం మీద నిర్మితమై ఉంది. బీజేపీని ఒక రాజకీయ పార్టీగా కాకుండా ఒక భావజాల ఉద్యమంగా చూడాల్సి ఉంటుంది. బీజేపీ చెప్పే హిందుత్వ రాజకీయాల్ని బీసీలే కాదు తెలంగాణలో ఏ వర్గమూ హర్షించదు. తెలంగాణలో ఒక ప్రత్యేక సామాజిక, రాజకీయ నేపథ్యం ఉంది. గత కొద్ది సంవత్సరాలుగా హిందూ ముస్లిం మతోన్మాదశక్తులు రెండు వర్గాల మధ్య కొంత విఘాతం కల్పించిన మాట నిజమే కాని, చారిత్రకంగా వారు మమేకమై జీవించిన సంస్కృతి ఇంకా బలంగానే ఉంది. హిందూ-ముస్లిం కొట్లాటను కొద్దిసేపు పక్కకు పెడితే... కాపు, పెద్ద బీసీ కులాలు ఒక అణగారిన వర్గంగా బీజేపీ చెప్పే హిందూత్వ రాజకీయాల్ని ఎలా చూడాలి? అణగారిన వర్గాలు ఈ రోజు అధోగతి పాలవడానికి ఈ హిందుత్వ భావజాలమే కారణం కాదా? దళిత, బహుజన, ఆదివాసీ వర్గాలను తరతరాలుగా అణచివేతకు, దోపిడీకి కారణమైన భావజాలాన్ని ఒక రాజకీయ అవకాశంగా చూడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించుకోవాలి. ఆధిపత్యకులాలు ఏదో ఒక వాదాన్ని పట్టుకుని అధికారంలోకి వచ్చాయి కదా, మనం చేస్తే తప్పు ఏమిటని అనుకోవచ్చు. ఒకటి మాత్రం నిజం. తెలుగుల ఐక్యత, తెలుగు జాతీయవాదం, తెలంగాణ వాదం వల్ల ప్రజలకు పెద్దగా నష్టం జరగలేదు. కొంత మేలే జరిగిందనుకోవాలి. ఈ వాదన మీద వచ్చిన రాజకీయ ఉద్యమాలు అణగారిన వర్గాల్లో కొత్త చైతన్యాన్ని నింపాయి. బీజేపీ హిందుత్వ భావజాలం ఈ చైతన్యాన్ని వెనక్కి నెట్టి మొత్తం సమాజాన్నే తిరోగమనంలో నడిపించే అవకాశం ఉంది. బీజేపీ భావజాలం నిజంగా అంత ప్రమాదకారా? ఇక్కడ ముఖ్యంగా మూడు విషయాలు చెప్పుకోవాలి. మొదటిది బీజేపీ సిద్ధాంతాలు. ఈ పార్టీ సిద్ధాంతాలు మనుధర్మశాస్త్రం, ఎంఎస్ గోల్వాల్కర్ రచించిన We or our Nationhood Defined', వి.డి. సావర్కర్ హిందూత్వ రచనల్లోని భావజాలం మీద నిర్మించబడ్డాయి. ఈ రచనల సారం క్లుప్తంగా చెబుతాను. మనుధర్మశాస్త్రాన్ని బ్రాహ్మణులు వారి కుటుంబశాస్త్రంగా భావిస్తారు. కాని ఆధిపత్యంలోకి వచ్చిన ప్రతి కులం దీన్ని తూ.చ తప్పకుండా పాటిస్తుంది. ఈ శాస్త్రం ఏ కులం ఎలా పుట్టింది, సమాజంలో వాటి స్థానం, అవి నిర్వహించాల్సిన ధర్మాలు, కులవ్యవస్థ శాశ్వతంగా ఉండడానికి పాటించాల్సిన నియమాలను సవివరంగా వివరిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ దేశంలో కులవ్యవస్థను చెక్కు చెదరకుండా కాపాడుతున్నది ఈ మనుధర్మ శాస్త్రమే. గోల్వాల్కర్ హిందూ ఒక జాతియని, ఈ దేశం హిందువులదని, ఈ దేశంలో ఉండాలంటే ప్రతి ఒక్కరూ హిందువై ఉండాలని బోధించాడు. సావర్కర్ హిందూత్వను ఒక మత రాజకీయ సిద్ధాంతంగా అభివర్ణించాడు. ఈ భావజాలం మీద నిర్మితమై ఉన్న బీజేపీని ఆహ్వానించడం అంటే కుల వ్యవస్థను ఇంకా బలోపేతం చేయడమే అవుతుంది. అంతేకాక ఈ దేశ విభిన్న సంస్కృతులను, భాషలను, మతాచారాలను ధ్వంసం చేసి, హిందూ ఫాసిస్టు సమాజ, దేశ నిర్మాణం చేయాలన్న భావనకు ఊతమిచ్చిన వాళ్లవుతారు. బీజేపీ మూల సిద్ధాంతాలన్నీ కల్పితమైన అబద్ధాల మీద నిర్మితమై ఉంటాయి. అయితే అవి చాలా కన్విన్సింగ్‌గా ఉంటాయి. ఈ దేశంలో హిందువులు మెజారిటీ కాబట్టి వారి ఆధిపత్యం మీద నడవాలనే అంశం చాలా సహజమైన సిద్ధాంతంగా చిత్రీకరిస్తారు. ఒక సాధారణ అభిప్రాయం ఏమంటే బీజేపీ హిందూత్వ కేవలం ముస్లిం, క్రిస్టియన్ మత మైనారిటీ వర్గాలకే వ్యతిరేకమని. ఇంది కొంత వరకు నిజం. ఎందుకంటే బీజేపీ ఈ రోజు ఈ స్థాయికి రావడానికి పార్టీ చేసిన ముస్లిం మత మైనార్టీల వ్యతిరేక భావనే కారణం. కాని లోతుగా ఆలోచిస్తే, ఈ పార్టీ దళిత, బహుజన, ఆదివాసీ వర్గాల అణచివేతే ప్రధాన ఎజెండాగా పనిచేస్తుంది. మండల్ కమిషన్ ఉద్యమకాలంలో ఈ పార్టీ నిర్వహించిన పాత్ర అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ఈ ఉద్యమంలో భాగంగా ఈ వర్గాలలో వచ్చిన చైతన్యాన్ని బాబ్రీ మసీదు సంఘటనతో ఒక్కసారిగా వెనక్కి నెట్టేసింది. బాబ్రీమసీదు సంఘటన జరగకుండా ఉంటే ఈ వర్గాల్లో వచ్చిన చైతన్యం ఈ దేశంలో బహుజన ప్రత్యామ్నాయ రాజకీయాలకు నాంది పలికేది. రెండవ అంశం హిందుత్వకు కాపిటలిజంను జోడించడం. ఇది డెడ్‌లీ కాంబినేషన్. 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బీజేపీ అభివృద్ధి, ఉద్యోగ కల్పన అనే నినాదాన్ని హిందూత్వకు జోడించి ప్రజలకు కొత్త భ్రమలను కల్పించింది. అధికారంలోకి రాగానే ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా కొంతమంది పెట్టుబడిదారులకు అమ్మేసింది. గత తొమ్మిది సంవత్సరాల్లో అనేక సంస్థలు ప్రైవేటుపరమైనాయి. రాజ్యాంగ సంస్థలు ఆర్‌బిఐ, సిబిఐ, ఈడీ, ఆర్మీ, కోర్టులు అన్నీ నిర్వీర్యం అయ్యాయి. ఇవన్నీ కూడా దేశ, జాతి ప్రయోజనాల కోసమే చేస్తున్నామని నమ్మబలికారు. కాని చివరికి నష్టపోయిందంతా దళిత, బహుజన, ఆదివాసీ వర్గాలే. ఎందుకంటే ఈ వర్గాలకు న్యాయం జరగాలన్నా, వారి పిల్లలకు ఉద్యోగాలు రావాలన్నా ప్రభుత్వరంగ సంస్థలే ప్రధాన ఆధారం. వాటన్నింటికీ మించి ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ తీసుకురావడం ద్వారా రిజర్వేషన్ విధానాన్నే నీరుగార్చారు. ఇటు ప్రభుత్వరంగం కుంచించుకుపోయి, అటు ప్రైవేటు రంగంలో ఆదరణ లేక అణగారిన వర్గాలు దిక్కుతోచని పరిస్థితికి నెట్టివేయబడ్డాయి. మూడో విషయం ప్రత్యామ్నాయ రాజకీయాలు. 1990 నుంచి దేశంలో, తెలుగు రాష్ట్రాల్లో దళిత బహుజన ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రాజకీయాలు ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాధికారం నినాదంతో ముందుకు వస్తున్నాయి. ఈ తరహా రాజకీయాలు ముందుకు వచ్చినప్పుడల్లా, హిందుత్వ రాజకీయాలు వాటిని వెనక్కి నెట్టేస్తూ ఉన్నాయి. ఒక విధంగా దళిత, బహుజన రాజకీయాల్ని ఒక ప్రశ్నార్థకంగా మిగల్చడంలో బీజేపీ ముందు వరుసలో ఉంది. ఈ రోజు కాపు, పెద్ద బీసీ కులాలు తెలంగాణలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరమైతే ఉంది. ఏ రకమైన రాజకీయాల వైపు వాళ్ళు నిలబడదలచారు? దళిత బహుజనవాదం ప్రాతిపదిక మీద రాజకీయాల్ని నిర్మించడమా? లేక హిందూ మతతత్వ పార్టీ ముసుగులో అధికారంలోకి రావడమా? ఏ రకమైన రాజకీయాలు అణగారిన వర్గాలకు అణచివేత, దోపిడీ నుంచి విముక్తి కలిగిస్తాయి? అసలు మతతత్వ రాజకీయాల్ని తెలంగాణ ప్రజలు హర్షిస్తారా? ముఖ్యంగా మొన్నటి కర్ణాటక ఎన్నికల నుంచి ఏమి నేర్చుకోవాలి? ఈ ప్రశ్నలను లోతుగా ఆలోచించకుండా రాజకీయాలు చేస్తే, ఆ రాజకీయాలు నిలబడవని గుర్తించాలి.

## కేసీఆర్‌తోనే తెలంగాణ స్థిరీకరణ

రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు సిద్ధమవుతున్నాయి. ఇటీవలే ఆయా పార్టీల రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు కూడా ముగిశాయి. ఇక అభ్యర్థుల ప్రకటనే ఆలస్యమన్నట్టుగా క్యాడర్‌లో మరింత ఉత్సాహం నింపే పనిలో ఆయా పార్టీలు నిమగ్నమయ్యాయి. అయితే ఈ ఎన్నికల్లో భాగంగా ప్రజలు ఆలోచించాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. రాబోయే కాలంలో రాష్ట్రంలో పాలన ఎవరు చేయాలనే అంశాన్ని నిర్ణయించుకోవడంలో ప్రజలు విజ్ఞత, తెలివి, పోరాట, ఉద్యమస్ఫూర్తి ప్రదర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ ఎన్నికలు తెలంగాణ చరిత్రకు కీలక మలుపుగా మారనున్నాయి. తొమ్మిదేండ్ల కిందట ఏర్పడిన తెలంగాణ పరిపాలన, రాజకీయంగా అనేక అవరోధాలు అధిగమించి అభివృద్ధి, సంక్షేమం వైపు అభ్యుదయకరమైన రాష్ట్రానికి గట్టి పునాది వేశారు తెలంగాణ దార్శనికుడు ముఖ్యమంత్రి కేసీఆర్. ఇదే పంథా, ఇదే వేగంతో రాష్ట్రం ఆర్థిక, రాజకీయ, సామాజిక, సంక్షేమ, అభివృద్ధి, అస్తిత్వం స్థిరీకరణ జరగాల్సిన అవసరం చాలా ఉన్నది. ఈ స్థిరీకరణ కేసీఆర్ తప్ప మరెవ్వరూ చేయలేరు. ఆయకట్టు స్థిరీకరణకు వ్యూహాత్మక నీటి ప్రాజెక్టులు ఎంత ముఖ్యమో.. భౌగోళిక తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, సంక్షేమ, అభివృద్ధి, అస్తిత్వం స్థిరీకరణకు కేసీఆర్ నాయకత్వం అంతే ముఖ్యం. తెలంగాణను స్థిరీకరణ చేసుకోవాల్సిన బాధ్యత ప్రజల పైనే ఉన్నది. ఆంధ్రాలో కృష్ణా, గోదావరి డెల్టాల ప్రాంతాల్లో ఆయకట్టు స్థిరీకరణ కోసం వ్యూహాత్మక ప్రాజెక్టులు, బ్యారేజీలు కట్టడంతో వందల ఏండ్లయినా అవి పంటలతో కళకళలాడుతూ ఉన్నాయి. అట్లాగే తెలంగాణలో కూడా స్థిరీకరణ జరగాలంటే పరిపాలన కేసీఆర్ చేతుల్లోనే ఉండాలి, ఉండితీరాలి. అస్తిత్వ స్థిరీకరణ లేకపోతే తెలంగాణ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ఈ స్థిరీకరణ కోసం ప్రజలు తెలివితో, ఉద్యమస్ఫూర్తితో ఓట్లువేయాల్సిన అవసరం ఉన్నది. ఈ తొమ్మిదేండ్లలో తెలంగాణ గతంలో ఎన్నడూ లేనటువంటి ఫలితాలు చూసింది. ఈ ఫలితాలు ఇలాగే కొనసాగాలంటే కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. కేసీఆర్ విజయం కేసీఆర్ కోసం కాదు. అది తెలంగాణ స్థిరీకరణకు చాలా అవసరం. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. అయితే ఆ పార్టీలకు రాష్ట్రంలో నాయకత్వం వహిస్తున్న నాయకులకు తెలంగాణ పట్ల ప్రేమ, తెలంగాణ అభివృద్ధి పట్ల ఒక వ్యూహం ఉన్నట్టు కనిపించడం లేదు. ప్రధాన కారణం ఇప్పుడున్నటువంటి నాయకులు ఇద్దరూ కూడా తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్నది శూన్యం. రాజకీయ వ్యవహారశైలి, అధికార వ్యామోహం తప్ప, వారిలో తెలంగాణ అభివృద్ధి వ్యూహం కనిపించటం లేదు. అంతేకాదు, తెలంగాణ ఏర్పడిన కొత్తలో రాష్ట్రంలో రాజకీయ అస్థిరత క్రియేట్ చేయటానికి ఎమ్మెల్యే కొనుగోలు కోసం రూ.50 లక్షలు ఇస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన వ్యక్తి ఒక పార్టీకి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మరోవైపు నిరంతరం తెలంగాణ పుట్టుకనే ప్రశ్నించే విధంగా బీజేపీ కేంద్ర నాయకత్వం ఉన్నది. ఇక ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అదే ధోరణితో తెలంగాణ లో మత చిచ్చు పెట్టేవిధంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ అభివృద్ధికి అదనపు నిధులు తీసుకువచ్చిన దాఖలాలు మాత్రం లేవు. లేకపోగా, 10వ తరగతి ప్రశ్నపత్రాల లీకేజీలో ఏ1గా ఉన్నారు. అంటే రెండు జాతీయపార్టీల రాష్ట్ర అధ్యక్షులు వేర్వేరు నేరపూరిత కేసుల్లో ఏ1గా ఉన్నారు. కేసీఆర్ 2001లో పార్టీ స్థాపించినప్పటి నుంచి ఉద్యమ నాయకుడిగా.. 2014 నుంచి పరిపాలనా అధిపతిగా ఉంటూ ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. 2001 నుంచి 2014 వరకు తెలంగాణ వ్యతిరేకులు కేసీఆర్‌పై ఎలాంటి వ్యక్తిగత విమర్శలు చేశారో.. 2014 తర్వాత కూడా అవే విమర్శలు చేస్తున్నారు తప్ప, తెలంగాణ అభివృద్ధి నమూనాను కేసీఆర్ కంటే గొప్పగా ప్రజల ముందు పెట్టలేకపోతున్నారు. ఈ తొమ్మిదేండ్లలో తెలంగాణ పలు రంగాల్లో ఎలా అభివృద్ధి చెందిందనే అంశాలపై కేంద్రంలోని రాజ్యాంగబద్ధ సంస్థలు నిరంతరం నివేదికలు ఇస్తున్నాయి. దీన్ని మరింత మెరుగుపరచుకోవటం లేదా, మరింత స్థిరీకరించుకోవాలంటే తెలంగాణ సాధించి పెట్టినటువంటి వ్యక్తి కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ పాలన ఉండాలి. తెలంగాణ స్థిరీకరణ జరగకపోతే తెలంగాణ అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నది. ఒకవైపు ఉద్యమ, అభివృద్ధి నాయకుడు, మరోవైపు నేరపూరిత కేసుల్లో ఏ1 నిందితులు అందుకే ఆరు నెలల్లో జరిగే ఎన్నికల యుద్ధంలో తెలంగాణ అస్తిత్వ స్థిరీకరణ కేసీఆర్‌తోనే సాధ్యమని బలంగా చెప్పాలి. ఆయకట్టు స్థిరీకరణ కోసం నీళ్లు ఎంత అవసరమో రైతులకు తెలుసు. 22 ఏండ్లుగా తెలంగాణ ప్రజలు పలు సందర్భాల్లో రాజకీయంగా తెలివైన నిర్ణయమే ఓట్ల ద్వారా తీసుకుంటున్నారు. తెలంగాణ మీద ప్రేమ రాష్ట్రంలో కేసీఆర్‌కు తప్ప ఏ రాజకీయ పార్టీ అధ్యక్షులకు ఉన్నట్టు కనిపించటం లేదు.

## స్కీమ్ లపైనే ఆశలన్నీ

నల్గోండ, మే 30 :భారత రాష్ట్ర సమితి అసెంబ్లీ ఎన్నికలకు ముందు పలు స్కీమ్ లతో ప్రజలతో అనుబంధాన్ని పెంచుకోవాలని యోచిస్తోంది. రాష్ట్రం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటూ.. పలు పథకాలతో ప్రజలను ఆకర్షించడానికి ముందుకు వస్తోంది. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాలలో సంక్షేమ పథకాలను పంపిణీ చేయడం, అమలు చేయడం ద్వారా తన ఓటు బ్యాంకును పెంచుకోడానికి ప్రయత్నం చేస్తోంది. రానున్న రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన వర్గాలకు పోడు భూముల పట్టాలు పంపిణీ చేస్తుంది, గృహ లక్ష్మి పథకం కింద పేద కుటుంబాలకు 3 లక్షల ఆర్థిక సహాయం, ప్రతి దళిత కుటుంబానికి 10 లక్షలు అందజేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడానికి కేసీఆర్ ముందుకు వచ్చారు. ప్రస్తుతానికి కొందరికే ఈ పథకాలు దక్కినా.. రాబోయే రోజుల్లో ఎంతో మంది లబ్ధిదారులు ఇందులో భాగమయ్యేలా చూడనున్నారు. జూన్ 24 నుంచి 30 వరకు పలు జిల్లాల్లో లబ్ధిదారులకు పోడు భూముల పట్టా పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు పాల్గొంటారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకులో ఎక్కువగా బీసీలే ఉన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా బీసీ సామాజికవర్గం ఓట్లు ఉన్న నేపథ్యంలో వారిని తమతోనే ఉంచుకోవాలని బీఆర్ఎస్ భావిస్తూ ఉంది. 2014, 2018 ఎన్నికల్లో ఈ సామాజికవర్గంతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపాయి. వచ్చే ఎన్నికల్లో కూడా ఆయా సామాజికవర్గాల మద్దతు తమకేనని బీఆర్ఎస్ భావిస్తోంది. అందుకోసమే వారి కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను తీసుకుని వస్తున్నారు. ఆ పథకాలే బీఆర్ఎస్ కు హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయని ఆశిస్తూ ఉన్నారు.

### "అందరం సంఘటితంగా ముందుకు వెళదాం"...:పద్మశాలీల జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్



ఆసిఫాబాద్ జిల్లా మే30 (ప్రజాపాలన, ప్రతినిధి) : పద్మశాలీలు సంఘటితంగా ఉంటూ ముందుకు వెళదామని సంఘం రాష్ట్ర నాయకుడు మచ్చ ప్రభాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన పద్మశాలీల సంఘం సభ్యత్వ పుస్తకాలను స్థానిక సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయంగా,ఆర్థికంగా, సామాజికంగా,ఎదగాలన్నారు. అత్యధిక సభ్యత్వాలు చేసి పద్మశాలీల ఐక్యత చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపురావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకయ్య, నాయకులు ఇరుకుల్ల ఆంజనేయులు, ఇరుపుల్ల మంగ,లింగయ్య, హనుమాన్లు,శ్రీకాంత్, ధర్మయ్య, శ్రీనివాస్, సంజీవ్, తిరుపతి సునీత, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం... దశాబ్ద తెలంగాణ...



హైదరాబాద్, మే 30, :తెలంగాణ పదేళ్ల పస్థానంలో సంక్షేమ పథకాలు కీలకం. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పదేళ్ల కాలంలో పలు కీలక పథకాలు అమలుచేశారు సీఎం కేసీఆర్. తెలంగాణలో రెండుసార్లు అధికారం చేపట్టిన కేసీఆర్... సంక్షేమ పథకాల ఆచరణలో దేశం మొత్తాన్ని ఆకర్షించారు. తెలంగాణలో అమలుచేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. రైతు బంధు, దళిత బంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి వంటి కీలక సంక్షేమ పథకాల అమలు చేస్తుంది. తెలంగాణ పదేళ్ల ప్రస్థానంలో పలు కీలక పథకాలు అమలు చేసింది కేసీఆర్ ప్రభుత్వం.

**రైతు బంధు**

వ్యవసాయం కోసం పెట్టుబడిని రుణంగా రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే రైతుబంధు. ఈ పథకాన్ని సీఎం కేసీఆర్ 2018, మే 10న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ శాలపల్లి-ఇందిరానగర్ వద్ద ప్రారంభించారు. మొట్టమొదటి సారిగా ధర్మరాజుపల్లి వాసులు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా చెక్కులు, పట్టాదార్ పాస్ పుస్తకాలు అందుకున్నారు. రైతుబంధు పథకం కింద ప్రభుత్వం ఎకరానికి రూ.5 వేల చొప్పున సాగుకు పెట్టుబడి సాయం చేస్తుంది. ఖరీఫ్, రబీ సీజన్ లకు ఎకరానికి రూ. 5 వేలు చొప్పున రెండు సీజన్లకు కలిపి రూ. 10 వేలు పెట్టుబడిగా ఇస్తుంది. ఈ మొత్తాన్ని రైతుకు చెక్కుల రూపంలో అందిస్తారు. ఈ పథకం కింద రుణం తీసుకున్న రైతులకు ఆరు నెలల పాటు వడ్డీ రాయితీ ఇస్తారు. రైతులు తాము తీసుకున్న రుణాలపై ఎలాంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరంలేదు. రాష్ట్రవ్యాప్తంగా 58.34 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటి వరకు రూ. 58,102 కోట్ల సాయం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది.

**దళిత బంధు**

తెలంగాణ దళితబంధు పథకం... దళితుల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పథకం. అర్హులైన దళితులకు ఈ పథకంలో భాగంగా కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. దళితుల సాధికారతే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది. పరిశ్రమలను, ఉపాధిని, వ్యాపారాన్ని ఎంచుకుని దళిత సమాజం వ్యాపార వర్గంగా అభివృద్ధి చెందడం కోసం ఈ పథకం ఉపయోగపడనుంది. 2021 ఆగస్టు 5న యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని 76 దళిత కుటుంబాలకు రూ. 7.60 కోట్ల నిధులను విడుదల జేయడంతో ఈ పథకం ప్రారంభించారు సీఎం కేసీఆర్. 2021 సంవత్సరం బడ్జెట్‌లో 'సీఎం దళిత్ ఎంపవర్‌మెంట్ స్కీమ్' పేరుతో వెయ్యి కోట్లు కేటాయించారు.

**మిషన్ భగీరథ**

తెలంగాణలోని ప్రతి ఇంటికీ మంచి నీటిని అందించాలనే ఉద్దేశంతో 43,791 కోట్ల బడ్జెట్‌తో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ను ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామాలలోని ఇళ్లకు తాగునీరు అందిస్తున్నారు. గోదావరి నది (53.68 టీఎంసీ), కృష్ణా నది (32.43 టీఎంసీ) నుంచి సేకరించిన నీటి ద్వారా రాష్ట్రంలోని అన్ని గృహాలకు తాగునీటిని సరఫరా చేస్తుంది ప్రభుత్వం. మిషన్ భగీరథ అమలు కోసం ప్రభుత్వం తెలంగాణ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ ని ఏర్పాటుచేసింది. 59 ఓవర్ హెడ్, గ్రౌండ్ లెవల్ ట్యాంకులు అందుబాటులో తెచ్చింది. అదేవిధంగా పైపింగ్ వ్యవస్థ 1.697 లక్షల కిలోమీటర్లు నడుస్తుంది.

**డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం**

తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన హౌసింగ్ ప్రాజెక్ట్ డబుల్ బెడ్ రూమ్ పథకం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది ఈ పథక లక్ష్యం. ఈ పథకం ద్వారా 2019, మార్చి 2.72 లక్షల ఇళ్లు, 2024 నాటికి అదనంగా మరో 3 లక్షల ఇళ్లను నిర్మించనున్నారు. 2014, మే నెలలో తెలంగాణ రాష్ట్ర సమితి ఎన్నికల మానిఫెస్టోలో ఈ పథకాన్ని కేసీఆర్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేదలకోసం 5.72 లక్షల ఇళ్లు కేటాయించారు. 2016, మార్చి 5న ఎర్రవల్లి వద్ద డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు సంబంధించిన పైలట్ ప్రాజెక్టును నిర్మించారు. డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం పథకంలో భాగంగా 9,328.32 కోట్ల రూపాయల ప్రతిపాదిత వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా 2,91,057 ఇళ్లు మంజూరు చేశారు.

**ఆసరా పింఛను పథకం**

తెలంగాణ ఆసరా పింఛను పథకం ద్వారా వృద్ధుల, వికలాంగులకు పింఛన్ అందిస్తుంది తెలంగాణ ప్రభుత్వం. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, హెచ్.ఐ.వి. - ఎయిడ్స్ ఉన్నవారు లబ్ధిపొందుతున్నారు. దేశంలోనే బీడి కార్మికులకు ఆసరా పింఛను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కేసీఆర్ అన్నారు. పింఛన్లను పెంచుతామని కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, వితంతువుల పింఛన్లను రూ.200 నుంచి రూ. 1000, వికలాంగులకు రూ.500 నుంచి రూ.1500 లకు పెంచుతున్నట్టు తెలిపారు. 2019లో వృద్ధులు, వితంతువుల పింఛన్లను రూ.1,000 నుంచి రూ. 2,016, వికలాంగులకు రూ.1,500 నుంచి 3,016 రూపాయలకు పెంచారు.

**కాళేశ్వరం**

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ తెలంగాణలోని భూపాల్ పల్లి కాళేశ్వరంలోని గోదావరి నదిపై నిర్మించారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ గా కాళేశ్వరం ఉంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను 13 జిల్లాల ద్వారా సుమారు 500 కి.మీ దూరం వరకు 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించారు. 1,800 కిమీ కన్నా ఎక్కువ కాలువ నెట్‌వర్క్ ఈ ప్రాజెక్టులో ఉంది. మొత్తం 240 టీఎంసీ (మెడిగడ్డ బ్యారేజ్ నుంచి 195, శ్రీపాద యల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 20, భూగర్భజలాల నుంచి 25) ఉత్పత్తి చేయాలని ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఉంది. వీటిలో 169 నీటిపారుదల కోసం, 30 హైదరాబాద్ మునిసిపల్ నీటికి, 16 ఇతర పారిశ్రామిక అవసరాలకు, 10 సమీప గ్రామాల్లో తాగునీరు వినియోగిస్తున్నారు. 21 జూన్ 2019న ఈ ప్రాజెక్టును అప్పటి తెలంగాణ గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్, ఫడ్నవీస్ , సీఎం జగన్ ప్రారంభించారు.

# కాంగ్రెస్ గూటికే జూపల్లి, పొంగులేటీ ?

హైదరాబాద్, మే 30, :తెలంగాణ సీనియర్ రాజకీయ నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు ఏ పార్టీలో చేరుతారన్నదానిపై ఎడతెగని చర్చ జరుగుతోంది. ఈటల, పొంగులేటి, జూపల్లి రహస్య భేటీ నిర్వహించారు. గన్‌మెన్లను కూడా తీసుకెళ్లకుండా ఈటల జూపల్లి, పొంగులేటితో ఏం చర్చించా రనన్న అంశంపై ఉత్కంఠ రేపుతోంది. మరో వైపు కాంగ్రెస్ కూడా ఈ ఇద్దరిని హస్తం గూటికి చేర్చేందుకు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేసింది.. దీంతో ఏ పార్టీలో చేరాలనే విషయంలో ఈ ఇద్దరు నేతలు మల్లగుల్లలు పడుతున్నారు. అసెంబ్లి ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలో నిలపాలనే పట్టుదలతో బీజేపీ నాయకత్వం ఉంది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో అసంతృప్తి నేతలే టార్గెట్‌గా ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లాలో బలమైన నేత , మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయాల్లో కీలక నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును ఎలాగైనా బీజేపీలోకి తీసుకు రావాలన్న పట్టుదలతో బీజేపీ ఉంది. అయితే బీజేపీలో చేరే విషయమై పొంగులేటి, జూపల్లి తేల్చకపోవడంతో సస్పెన్స్ కొనసాగుతోంది. వారిని ఎలాగైనా తమ వైపు తిప్పుకునేలా బీజేపీ పావులు కదుపుతోంది. హైకమాండ్ నుంచి వచ్చిన సూచనల మేరకు పొంగులేటి, జూపల్లితో ఈటల సమావేశం అయినట్లుగా చెబుతున్నారు. అలా అయితే అందులో రహస్యం ఎందుకని కొంత మంది డౌట్. పొంగులేటి, జూపల్లి కొత్త పార్టీ పెట్టబోతున్నా రని, ఆ క్రమంలోనే ఈటల వారితో రహస్య భేటీ జరిపినట్లు మరో ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో కొత్త నేతల చేరికలు బీజేపీకి తలనొప్పిగా మారాయి. కొత్త నేతల చేరడం అటుంచితే పార్టీ లో ఉన్న నేతలు కూడా చేజారే ప్రమాదముందన్న ఆందోళన బీజేపీ నేతల్లో వ్యక్తమవుతున్నట్లు చర్చ జరుగుతోంది. ఈటలపై బీజేపీ శ్రేణుల్లోనే అనుమానాలు నెలకొనడంతో పొంగులేటి, జూపల్లితో జరిగిన చర్చల్లో వారిని బీజేపీకి ఆహ్వానించే అంశాన్ని చర్చించారా..? లేక బీజేపీలోకి రావడంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేని పరిస్థితుల్లో పరోక్షంగా ప్రయోజనం కలిగించే ప్రత్యామ్నాయాలపై ఈటల వారితో చర్చించారా..? అని కొంత మంది బీజేపీ రాష్ట్ర నేతలు అనుమానపడుతున్నతము నిర్ణయాన్ని పొంగులేటి, జూపల్లి ప్రకటించకపోవడంతో వారి రాజకీయ వ్యూహంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఉమ్మడి శత్రువైన బీఆర్ఎస్‌ను రానున్న ఎన్నికల్లో ఓడించడాని బీజేపీ దగ్గరున్న వ్యూహాలు, తెలంగాణలో బీజేపనీకి ఉన్న బలం, ప్రజల్లో ఆదరణ, ఎన్ని సీట్లలో గెలుపు సాధ్యం తదితర అంశాలపై పొంగులేటి, జూపల్లి కి అనుమానాలున్నాయి. కాంగ్రెస్ కు గ్రామ గ్రామాన క్యాడర్ ఉండటంతో పాటు కర్ణాటక ఎన్నికల తర్వాత ఓ వేవ్ వచ్చింది. ఈ కారణంగా ఆ పార్టీ వైపు చూసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది.రేవంత్ రెడ్డి వారు వస్తారని గట్టి నమ్మకంతో ఉన్నారు.

**ఈటెల నిర్వేదం**

పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు ఇద్దరూ బీజేపీలో చేరడం కష్టమేనని.. బిజెపి రాష్ట్ర చేరికల కమిటీ ఛైర్మన్ ,హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



అన్నారు.. హైదరాబాద్ లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వారితో చర్చల గురించి వివరించారు. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ బలంగా ఉంది. బిజెపి లేదు. పొంగులేటి, జూపల్లితో నేను రోజూ మాట్లాడుతున్నాను. వారే నాకు రివర్స్ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. బిజెపిలో చేరేందుకు వారికి కొన్ని ఇబ్బందులున్నాయని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరకుండా మాత్రమే ఆపగలిగానని.. కానీ బీజేపీలోకి తీసుకు రాలేకపోయానని ఈటల చెప్పుకొచ్చారు. దీంతో పొంగులేటి, జూపల్లి ఇద్దరూ కూడా కాంగ్రెస్ లో చేరనున్నట్లు పరోక్ష సంకేతాలు ఇచ్చినట్లయింది.. బీఆర్ఎస్ బహిష్కృత నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావుని.. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఆకర్షిస్తున్నాయి. ఖమ్మంలో కాస్తో కూస్తో బలం ఉన్న ఆ ఇద్దరిని తమ జట్టులో కలుపుకోడానికి ఉబలాటపడుతున్నాయి. అయితే బీజేపీ నుంచి ఈటల ఓ అడుగు ముందుకేశారు. నేరుగా తానే వెళ్లి రెండుసార్లు వారిద్దరితో చర్చించారు. కానీ వర్కవుట్ కావడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూపల్లి.. ఎవరికి వారే బాగా పట్టున్న నేతలుకావడంతో వారిద్దరినీ పార్టీలో చేర్చుకోవటం వల్ల వచ్చే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ నాయకత్వం చాలా ఆఫర్లు ఇచ్చినట్లుగా ప్రచారం జరిగింది. అయితే అప్పటికప్పుడు జెండా కప్పుకోకుండా కర్ణాటక ఎన్నికల ఫలితాల వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటామని ఈటల బృందానికి పొంగులేటి హామీ ఇచ్చారు. బీజేపీకి వ్యతిరేక ఫలితం రావడంతో ఇక బీజేపీలో చేరిక గురించి మర్చిపోయారు. ఫలితాల తర్వాత మాత్రం కాంగ్రెస్ వైపే పొంగులేటి , జూపల్లి అడుగులు కూడా పడుతున్నాయన్న ప్రచారం జరిగింది., కాంగ్రెస్‌కే జై కొట్టాలని ఇద్దర నేతల అనుచరులు కూడా పట్టుబడటంతో ఆ మేరకు తుది నిర్ణయానికివచ్చినట్టు సమాచారం. వాస్తవానికి ఇంతకు ముందే ఇద్దరూ కాంగ్రెస్ జెండా కప్పుకోవాలి. ప్రియాంక గాంధీ హైదరాబాద్ పర్యటనలో కాంగ్రెస్ పార్టీలో చేరుతారని అనుకున్నారు. అయితే అప్పట్లో బీజేపీ నేతలు వత్తిడి తీసుకురావడంతో ఆలోచన వాయిదా పడ్డప్పటికీ ఇక ఇదే ఫైనల్ డెసిషన్ అంటున్నారని అంటున్నారు. జూపల్లి, పొంగులేటి మాత్రమే కాదు బీజేపీలో చేరాలని చాలా మంది నేతలు ఉత్సాహపడుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# సోషల్ మీడియాలో బీజేపీ ఫస్ట్ లిస్ట్..

హైదరాబాద్, మే 30, :రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో ఎలాగైనా విజయం సాధించాలని దృఢ నిశ్చయంతో ఉన్న బిజెపి ఈసారి అభ్యర్థులను ముందుగానే ఖరారు చేస్తూ ప్రజాక్షేత్రంలో ముందునుంచి తిరిగేలా చెయ్యాలని భావిస్తోంది. ఈమేరకు సర్వేలు చేస్తూ ప్రజల మద్దతు పొందుతున్న అభ్యర్థులను ఖరారు చేసే పనిలో పడింది. అయితే తాజాగా సోషల్ మీడియాలో బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా అంటూ ఒక జాబితా వైరల్ అవుతోంది. అందులో 25 నియోజకవర్గాలకు, 25 మంది అభ్యర్థులను బిజెపి ఖరారు చేసినట్టు, అభ్యర్థుల పేర్లతో సహా లిస్ట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లిస్టు ఏ నియోజకవర్గం నుంచి, ఎవరెవరు పోటీ చేస్తున్నారు అన్నది ఆసక్తికర చర్చకు కారణంగా మారింది. 25 మందితో బిజెపి మొదటి లిస్ట్ అని ప్రచారం అవుతున్న లిస్టులో పాలమూరు నియోజకవర్గం - జితేందర్ రెడ్డి గద్వాల నియోజకవర్గం- డికె అరుణ కరీంనగర్ నియోజకవర్గం - బండి సంజయ్ కుమార్ అంబర్ పేట్ నియోజకవర్గం - కిషన్ రెడ్డి ముషీరాబాద్ నియోజకవర్గం - డా. లక్ష్మణ్ నిజామాబాద్ నియోజకవర్గం - అరవింద్ హుజూరాబాద్ నియోజకవర్గం- ఈటల రాజేందర్ దుబ్బాక నియోజకవర్గం- రఘునందన్ రావు మునుగోడు నియోజకవర్గం- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేవెళ్ళ నియోజకవర్గం - కొండా విశ్వేశ్వర్ రెడ్డి .. వికారాబాద్ నియోజకవర్గం - చంద్రశేఖర్ వరంగల్(తూర్పు) నియోజకవర్గం - ఎర్రబెల్లి ప్రదీప్ రావు భూపాలపల్లి నియోజకవర్గం - కీర్తి రెడ్డి పరకాల నియోజకవర్గం- డా. కాళీ ప్రసాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం- కూన శ్రీశైలం గౌడ్ స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గం - డా. విజయ రామారావు వర్ధన్నపేట నియోజకవర్గం- కొండేటి శ్రీధర్ ఉప్పల్ నియోజకవర్గం- ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్ భువనగిరి నియోజకవర్గం- జిట్టా బాలకృష్ణారెడ్డి గోషామహల్ నియోజకవర్గం- రాజాసింగ్ నారాయన్ ఖేడ్ నియోజకవర్గం - సంగప్ప నిర్మల్ నియోజకవర్గం - ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేములవాడ నియోజకవర్గం - తుల ఉమ ఎల్లారెడ్డి నియోజకవర్గం- ఏనుగు రవీందర్ రెడ్డి నర్సంపేట నియోజకవర్గం - రేవూరి ప్రకాశ్ రెడ్డి లు ఎన్నికల బరిలోకి దిగుతారని చర్చ జరుగుతుంది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ లిస్టు బీజేపీ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ లిస్టు ఎవరు వైరల్ చేస్తున్నారన్నది చర్చనీయాంశం అవుతుంది. అయితే ఆయా నియోజకవర్గాలలో మాత్రం అభ్యర్థిపై ఆసక్తికర చర్చ జరుగుతుంది. ఇది నిజంగానే బిజెపి తయారు చేసిన లిస్టు నా.. లేక బీజేపీ దీనిపై జనాలు ఏమనుకుంటారో అని తెలుసుకోవడానికి వదిలిన ఫీలర్ నా అన్నది తెలియాల్సి ఉంది.

## మళ్లీ వేడెక్కిన తాడిపత్రి

అనంతపురం, మే30, :అనంతపురం జిల్లా తాడిపత్రి రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. తాడిపత్రిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్సెస్ జేసీ ప్రభాకర్ రెడ్డి మధ్య వార్ కొనసాగుతోంది. ఇక ఇదే సమయంలో తాజాగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ని టార్గెట్ చేస్తూ కరపత్రాలు స్థానికంగా కలకలం సృష్టించాయి. మూడో విడత ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. నేటితో మూడో విడత ప్రజా సంక్షేమ యాత్ర పూర్తి కానున్న నేపథ్యంలో గన్నెవారి పల్లి కాలనీలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. అయితే ఈ క్రమంలోనే ఎమ్మెల్యే పెద్దారెడ్డి కి వ్యతిరేకంగా కరపత్రాలు స్థానికంగా కలకలం గా మారాయి. ఆ కరపత్రాల లో ఎమ్మెల్యే పెద్దారెడ్డిని టార్గెట్ చేస్తూ అనేక అంశాలు ఉన్నాయి. ప్రతి రోజు జేసీ సోదరులను తలచుకోకపోతే నీకు నిద్ర పట్టదు పెద్దారెడ్డి అంటూ టార్గెట్ చేశారు. పెద్దారెడ్డి ప్రజల కోసం తాను ఏం చేశారు అనేది చెప్పుకోవడం లేదని, ఎందుకంటే ఆయన చేసింది ఏమీ లేదు కాబట్టి చెప్పలేకపోతున్నారు అంటూ విమర్శించారు. దోచుకోవడం గురించి పెద్దారెడ్డి మాట్లాడడం బాగోదని కరపత్రాలలో ఎద్దేవా చేశారు. దీంతో కరపత్రాలను గురించి ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఈ పని చేసింది ఎవరో అందరికీ తెలుసన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం కోసమే ప్రత్యర్థులు ఈ విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారు గెలవరని భావించి, ఇలాంటి కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిపై చర్చ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. కరపత్రాల రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఇదిలా ఉంటే తాడిపత్రిలో కరపత్రాల

# హస్తినకు చేరిన రాజస్థాన్ వ్యవహారం



జైపూర్, మే 30, :రాజస్థాన్ కాంగ్రెస్ పంచాయతీ ఢిల్లీకి చేరింది. సీఎం అశోక్ గెహ్లాట్, ,మరో సీనియర్ సచిన్ పైలట్ మధ్య రాజకీయ వివాదాలు తీవ్రంగా మారాయి. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేతో అశోక్ గెహ్లాట్ భేటీ కానున్నారు. ఆ తర్వాత విడిగా సచిన్ పైలట్ కూడా సమావేశం కానున్నారని తెలుస్తోం ది. తాను చేసిన మూడు ప్రధాన మైన డిమాండ్లను ఈనెలాఖరులోపు పరిష్కరించకుంటే రాజస్థాన్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతా మని హెచ్చరించిన సచిల్ పైలెట్.. అశోక్ గెహ్లాట్ సర్కార్ కు అల్టిమేటం జారీ చేశారు. సచిన్ పైలట్ గెహ్లాట్ కు వ్యతిరేకంగా సీరియస్ గా రాజకీయాలు చేస్తున్నారు. అవినీతికి వ్యతిరేకంగా ఐదురోజులపాటు పాదయాత్ర చేశారు. తమది కూడా 40శాతం కమిషన్ ప్రభుత్వమేనని రాజస్థాన్‌లో గెహ్లాట్ కూడా 40 శాతం కమిషన్ సర్కార్ నడిపిస్తున్నారని పైలట్ వర్గానికి చెందిన ఓ మంత్రి చేసిన ఆరోపణ సంచలనం అయింది. కమిషన్ అప్పజెప్పనిదే ఫైళ్లు ముందుకు కదలడం లేదని విమర్శించారు. పైలట్ చేపట్టిన పాదయాత్రలో ఆరోపణలు చేసిన మంత్రి సహా 15 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తాము పార్టీ విడిచివెళ్లిపోవాలని గెహ్లాట్ అనుకుంటున్నారని, కానీ పార్టీలోనే కొనసాగుతామని, మీ వెంటే ఉంటామని ఎమ్మెల్యేలు పైలట్‌కు మద్దతు పలికారు. గత బీజేపీ ప్రభుత్వం అంటే వసుంధర రాజే ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అవినీతిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని పైలెట్ డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా.. రాజస్థాన్ కాంగ్రెస్ లో నాయకుల మధ్య విబేధాలను పరిష్కరించాలని అధిష్టానం సీరియస్ గా దృష్టి సారించింది. రాష్ట్ర కాంగ్రెస్ నేతలందరినీ ఒకే వేదికపై తీసుకురావాలని అన్ని ప్రయత్నాలు చేస్తోంది. గతంలోనూ ఓ సారి సచిన్ పైలట్ తిరుగుబాటుకు ప్రయత్నించారు. కొంత మంది ఎమ్మెల్యేలు ఆయన వెంట వెళ్లారు.అయితే ప్రభుత్వం పడిపోయే పరిస్థితి లేకపోవడంతో మళ్లి తిరిగి వచ్చారు. తర్వాత కేబినెట్ ను మార్చి.. వారి మధ్య సయోధ్య చేశారు. అయితే ఇప్పుడు త్వరలో ఎన్నికలు జరగనున్నందున మరోసారి సచిన్ పైలట్ తన మార్క్ రాజకీయం చేస్తున్నారు . అయితే గెహ్లాట్ మాత్రం.. పైలట్ నమ్మకస్తుడు కాదని ఆయనను మాత్రం నమ్మవద్దని హైకమాండ్ కు చెబుతున్నారు. నిజానికి గెహ్లాట్ ను కాంగ్రెస్ అధ్యక్షుడ్ని చేయాలను కున్నారు.కానీ సీఎం పదవిని వదులుకుంటే పైలట్ కు చాన్సిస్తారని ఆయన వెనుకడుగు వేశారు.

## సిఐటియు ద్వారానే ఉద్యోగ కార్మికుల హక్కులు సాధ్యం: సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శి



ఆసిఫాబాద్ జిల్లా మే 30 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయం ఎదుట సిఐటియు 53వ అభివృద్ధి దినోత్సవం సందర్భంగా మంగళవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శి అల్లూరి లోకేష్, మంజం శ్రీనివాస్ లు, మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భావ దినోత్సవం 1970 మే 30 రోజున జెండా ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఇప్పటికీ 53 సంవత్సరాలు పూర్తి చేసుకున్నామని, సిఐటియు కార్మికులను ఐక్యం చేసి సంఘం నిర్మాణం చేసి పోరాటాల దిశగా ముందుకు వెళుతూ ఉద్యోగ కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తుందని, అందుకు హక్కులు సాధించుకోగలుగుతున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఎండగడుతూ సిఐటియు నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా హక్కులను కాపాడుకోవడం కోసం కార్మికులందరూ ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, సుధాకర్, తిరుపతి, స్వరూపా, లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలి



ఆసిఫాబాద్ జిల్లా మే29 (ప్రజాపాలన,ప్రతినిది) : బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇంటి స్థలం ఉన్నవారికి 3 లక్షలు మంజూరు ఇవ్వాలని, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లూరు లోకేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మహిళలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అర్హులైన మహిళలకు అందరికీ ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇంటి స్థలం ఉన్నవారికి రూ 3 లక్షలు మంజూరు చేయాలన్నారు, జిల్లాలో 15 మండలాల నుండి అనేకమంది మహిళలు ప్రతిరోజు కలెక్టర్ కార్యాలయం వద్ద తమకు ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, అదేవిధంగా ఇంటి స్థలం ఉన్నవారికి రూ 3 లక్షలను అర్హులైన పేదవారికి మంజూరు చేయాలని, ప్రతిరోజు కలెక్టర్ కార్యాలయం వద్ద గ్రామాల నుండి పేద మహిళలు పనులు వదులుకొని కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటున్నారని అన్నారు. ఒకవేళ మహిళల దరఖాస్తులను తిరస్కరించిన, వాళ్లకు డబుల్ బెడ్ రూమ్ లు మంజూరు చేయకపోయినా, సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ దిబ్బంధం చేస్తామన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో మహిళలు ఆదే కమల భాయ్, శాంతాబాయి, సుమలత, నిర్మల, కాంతా, సుమిత్ర, లక్ష్మీ, వసంత, సావిత్రిబాయి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబాన్ని పరామర్శించిన డా.కోట రాంబాబు



బోనకల్, మే 30 ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన నిమ్మతోట ప్రణయ్ కుమార్ రాత్రి జరిగిన రోడ్ ప్రమాదంలో మరణించగా వారి మృతదేహానికి ప్రముఖ వైద్యులు, పొంగులేటి శ్రీనన్న సైన్యం, మధిర నియోజకవర్గ ఇన్చార్జి డా.కోట రాంబాబు నివాళులు అర్పించారు. వారి మృతికి గల వివరాలు అడిగి తెలుసుకొని తల్లిదండ్రులను ఓదార్చారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బోనకల్ గ్రామ సర్పంచ్ సైదా నాయక్ , చిరునోముల గ్రామ సర్పంచ్ రవి , బండి వెంకటేశ్వర్లు , దారగాని నారాయణ , బీరెల్లి కృష్ణ , లక్ష్మణ్ , రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలకు అన్ని అవకాశాలను అందుకోవాలి

తాండూర్ ప్రజా పాలన ప్రతి నిధి విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత ఉన్నత శిఖరాలకు అన్ని అవకాశాలను అందుకోవాలని పీస్ టిపిసిసి ఉపాధ్యక్షులు ఎం రమేష్ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంగళవారం తాండూర్ భూకైలాస్ లో జరిగిన పీపుల్స్ కళాశాల వార్షికోత్సవంలో పాల్గొని ప్రసంగించారు కళాశాలలో చదివిన వ్యక్తులు ఉన్న శిఖరాలలో ఉన్నారని దృష్టిలో ఉంచుకొని ఉన్న సమస్యలతో ఉండాలని ఉద్యోగ అవకాశాలను దక్కించుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరాలంటే క్రమశిక్షణ ఎం తో బోధపడుతుందని తెలిపారు. కొందరు విద్యార్థులకు మేముంటాలను అందించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నాయకులు జనార్ధన్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ సత్య నందు తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాద ప్రభుత్వానికి గద్దె దింపాలి


**సిఐటియు జాతీయ నాయకులు సాయిబాబా**

**కార్మికులకు కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలి**



మధిర మే 30 ప్రజా పాలన ప్రతినిధి: కేంద్రంలో మతోన్మాద ప్రభుత్వాన్ని అందరూ ఐక్యంగా ఉండి గద్దె దింపాలని సిఐటియుజాతీయ నాయకులు ఎం సాయిబాబా పిలుపునిచ్చారు. సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డు నందు సిఐటియు మండల కన్వీనర్ పడకండి మురళి అధ్యక్షతన మతోన్మాదం, కార్మిక వర్గం పై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎం సాయిబాబా మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భవించి 53 సంవత్సరాలు పూర్తిచేసుకుని, కార్మికుల ఐక్యత, పోరాటం అనే నినాదంతో కార్మికుల సమస్యలను పరిష్కరించడం జరిగింది. ఈ దేశంలో ఉన్న కార్పొరేట్ వ్యవస్థలో కార్మికుల కర్షకులు యొక్క కష్టంతో సంపద సృష్టించబడుతుందో ఆ సంపదనంతాను బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్ వ్యవస్థ లకు బిజెపి ప్రభుత్వం కారు చౌకగా దోచిపెడుతుంది. కార్మికులకు కనీస వేతనం లేకుండా ఉద్యోగ భద్రత లేకుండా కార్మికుల యొక్క జీవన పరిస్థితి దుర్భరంగా మారింది. ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి అనేక కార్మిక చట్టాలను తెచ్చుకున్న కార్మికులు నేడు బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో బలముందని 44 చట్టాలను 4 కోడలుగా చేసి కార్మికుల అనాధలుగా చేస్తుందన్నారు. కార్మికుల పెరుగుతున్న అసంతృప్తిని, ప్రజా పోరాటాలను బలహీనపరచడం కోసం ఈ దేశంలో కులం పేరుతో మతం పేరుతో మతాన్ని విషం పేరుతో ప్రచారం చేస్తుంది. నేడు భారత రాజ్యాంగాన్ని ఖూనీచేస్తుంది. లౌకిక తత్వాన్ని మంటగడుపుతుంది, సమైక్య భావాన్ని మొత్తం నాశనం చేస్తుంది, రాజ్యాంగ వ్యవస్థలన్నీ నెరవేరియం అవుతున్నాయి.దేశంలో మతోన్మాద పార్టీ ఇంకా కొనసాగితే భారతదేశం ప్రజాస్వామ్యం మొత్తం ప్రమాదంలో పడే ప్రమాదం ఉంది. 2024లో ఎన్నికల సందర్భంగా ఈ దేశాన్ని మూఢనమ్మకాల వైపు మతోన్మాదం వైపుతీసుకెళ్లే ప్రయత్నం చేసే ప్రభుత్వానికి చర్మ గీతం పాడాలని కార్మిక వర్గాన్ని విజ్ఞప్తిచేస్తుంది. అన్ని కార్మిక సంఘాలు రాజకీయ అనుబంధాలకు నిమిత్తం లేకుండా దేశభక్తి యుద్ధ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 2వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంగా దేశంలో,రాష్ట్రంలో, జిల్లాలలో మహా పడవ ఉద్యమం నిర్వహించి బిజెపి యొక్క వినాచకరా విధానాలపై సమరభేరి మోగించాలని, మతోన్మాద బిజెపిని గద్దె దింపాలని, అదే కార్మికుల యొక్క ఐక్యతకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తలప్రోలురాధాకృష్ణ, ఐద్వా జిల్లా నాయకులు మండవ ఫణీంద్ర కుమారి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వడ్రానపు మధు, హమాలీ వర్కర్ లో మున్సిపల్ కార్మికులు, ఆర్డబ్ల్యూఎస్ కార్మికులు, బిల్డింగ్ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

## వృత్తిదారుల సంఘాలకు చేయూతను అందించాలని ప్రభుత్వంపై మండిపడ్డ రాష్ట ప్రధాన కార్యదర్శి పల్లపు విగ్నేష్



ఇబ్రహీంపట్నం మే తేది 30 ప్రజాపాలన ప్రతినిధి: అన్ని చేతి వృత్తిదారులకు చేయూతనిస్తున్న తెలంగాణ ప్రభుత్వం రజక, నాయిబ్రహ్మణ, కుమ్మరి,కమ్మరి,విశ్వబ్రహ్మణ తదితర చేతివృత్తిదారులకు ఆర్థికంగా అభివృద్ధి చెందడాకి సహకారం అందిస్తుందని. కానీ వడ్డెర వృత్తిదారులను ఆ జాబితాలో స్థానం కల్పించకపోవడం ఎంత వరకు సమంజసమని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ ,రంగారెడ్డి జిల్లా కన్వీనర్ దేరంగుల. లక్ష్మిపతిలు మంగళవారం ఒక ప్రకటన లో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటిన పోయిన కానీ వడ్డెర వృత్తిదారుల జీవితాలు మాత్రం ఎక్కడా వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది అన్నారు. సమాజంలో అభివృద్ధి లో తమదైన పాత్ర పోషించిన కానీ నేటికి వడ్డెర వృత్తిదారులను చిన్నచూపు చూస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిలో అనేకమంది వడ్డెరవృత్తిదారులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తమ జీవితాలను అర్థాంరంగా రాయిపని, మట్టిపని,కంకర పని, కంప్రెసర్ వర్క్, చిన్న చిన్న కాంట్రాక్టర్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వడ్డెరవృత్తిదారులను విస్మరించడం ఎంత వరకు సమంజసమని అన్నారు. కావున ఇప్పటికైన స్పందించి వడ్డెర వృత్తిదారులకు అన్ని చేతివృత్తిదారులకు ఇస్తున్న ఆర్థిక సహకారం అందించాలని కోరారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## సిపిఐ గోడపత్రిక విడుదల చేసిన ఓరుగంటి యాదయ్య




ఇబ్రహీంపట్నం మే తేది 30 ప్రజాపాలన ప్రతినిధి: భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ ) యాచారం మండల కార్యదర్శి మస్కు సంజీవ ఆధ్వర్యంలో యాచారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రజా గర్జన గోడపత్రిక ఆవిష్కరణకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య ముఖ్య అతిథిగా హాజరైనారు. జూన్ 4న కొత్తగూడెంలో జరుగుతున్న సిపిఐ ప్రజాగర్జన బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరణ సందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై తెలంగాణ వ్యాప్తంగా వందలాది యాత్రలు జరిగాయని అన్నారు. ఈ సందర్భంగా జూన్ 4న కొత్తగూడెంలో ప్రజా గర్జన బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. ఈ బహిరంగ సభకు వేలాది మంది ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజ తో పాటు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్ల వెంకట్ రెడ్డి , గోరేటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్ హాజరు అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అల్లిమద్దీన్, పూల యాదయ్య, రాజునాయక్, రాములు, సత్తయ్య నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయంలో మంత్రితో వీడియో కాన్ఫరెన్స్



శంకరపట్నం మే 30 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం దశాబ్ది ఉత్సవాలపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వార దశాబ్ది ఉత్సవాల నిర్వహణ విధివిధానాల విధివిధానాలపై అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి వీణవంక, జమ్మికుంట, మానకొండూరు, శంకరపట్నం మండలాల పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజా పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

## ఏలూరు వెన్నెల జన్మదిన వేడుకలు..



తల్లాడ, మే 30 (ప్రజా పాలన న్యూస్): తల్లాడ మండలంలోని కొత్త వెంకటగిరి గ్రామంలో సోమవారం రాత్రి చిన్నారి ఏలూరు వెన్నెల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. విజయ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ దొబ్బల శ్రీనివాసరావు మనవరాలు వెన్నెల జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మత్స్య ఉత్పత్తుల ఆహార మేళ



మంచిర్యాల టౌన్, మే 30, ప్రజాపాలన: తెలంగాణా ప్రభుత్వం మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజలకు చేపల ద్వార వివిధ రకాలైన ఆహార ఉత్పత్తులు వాటి నుంచి వచ్చే పోషక విలువలు వివిధ రకాల రుచులు పరిచయం చేయుటకు వినూత్నమైన కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని జిల్లా మత్స్యశాఖ అధికారి మంగళవారం అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 8, 9, 10 వ తేదీలలో పట్టణం లోని జిల్లా పరిషత్ బాయ్స్ హై స్కూల్ మైదానం నందు ఫిష్ ఫెస్టివల్ ఉంటుందని 10 స్టాల్ల యందు వివిధ రకములైన, రుచికరమైన చేపలు,రొయ్యల వంటలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అనుభవం కలిగినవారు ఔత్సాహికులు తమ వంటల నైపుణ్యం ద్వార వివిధ రకములు తయారు చేసి ప్రదర్శించుటకు మత్స్యశాఖ అవకాశం కలిపిస్తోందని ఆసక్తి కలిగినవారు ఈ కార్యక్రమంలో పాల్గొనుటకు ముందస్తుగా మత్స్యశాఖ కార్యాలయం నందు జూన్ 2వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అనుభవజ్ఞులు ఔత్సాహికులు ఈ కార్యక్రమం నందు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



శంకరపట్నం మే30 ప్రజాపాలన రిపోర్టర్: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో శాంతి నది తీరంలో ప్రతిష్టులై కొలువుదీరిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. పోలోజు మల్లయ్య భాగ్యలక్ష్మి దంపతులచే కలియుగ భూత భవిష్యత్ వర్ధమాన కాలజ్ఞాన ప్రవక్త జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్మాణం చేసి మంగళవారంతో రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా స్వామివారికి వేద పండితులు పోలోజు సుమన్ శాస్త్రి, చంద్రశేఖర ఆచార్య మంత్రోచ్చారణలతో పంచామృతాభిషేకము, మహా నైవేద్యము, హొామం వంటి క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## 3వ తేదీన రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించాలి...

**వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



ఇబ్రహీంపట్నం మే తేది 30 ప్రజాపాలన ప్రతినిధి :ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 3వ తేదీన నిర్వహించే రైతు దినోత్సవ కార్యక్రమాలపై వ్యవసాయ అధికారులు, రైతుబంధు కోఆర్డినేటర్లతో ఎమ్మెల్యే శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.రైతు దినోత్సవం సందర్భంగా కర్షకలతో సహపంక్తి భోజనాలు ఇతర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, ఏడీఓ సత్యనారాయణ, మండల కోఆర్డినేటర్ లు, ఏఓ, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఎరడపల్లిలో పౌర హక్కుల దినోత్సవం



శంకరపట్నం 30 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ కలకుంట్ల రంజిత్ రావు అధ్యక్షతన ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో దళితులపై వివక్ష అంటరానితనం, అస్పృశ్యత, రెండు గ్లాసుల విధానం లాంటి వివక్షలు ఏవి లేవని గ్రామంలోని అన్ని కులాల వారు కలిసిమెలిసి సోదర భావంతో మెలుగుతున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మారెడ్డి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గరిగే ప్రభాకర్, మండల అధ్యక్షుడు గొట్టె అర్జున్, మండల ప్రధాన కార్యదర్శి దేవునూరి కుమారస్వామి, అంబేద్కర్ వాదులు ఓదెలు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో రూ 50 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభోత్సవం



మేడిపల్లి, మే30 (ప్రజాపాలన ప్రతినిధి):హబ్సిగూడ డివిజన్ రవీంద్రనగర్ కాలనీలోని ఎస్.అర్ అపార్ట్మెంట్ సమీపంలో ఎమ్మెల్యే సిడిపి నిధుల ద్వారా రూ 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ తో కలిసి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ఆసీఫ్ అలీ, ఉప్పల్ మున్సిపల్ ఎస్ డబ్ల్యూ డి ఈ చందన, శానిటేషన్ సూపర్వైజర్ సుదర్శన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొంగల శ్రీధర్, నగేష్, దాచేపల్లి శ్రీధర్, బీజేపీ నాయకులు సంజయ్ పటేల్, సుమన్ రావు, స్థానిక కాలనీవాసులు మధుసూదన్ రెడ్డి, నరసింహ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రామిరెడ్డి, భాగ్యలక్ష్మి , మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితాలో రాజకీయ పార్టీల పాత్ర ముఖ్యం: జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే



ఆసిఫాబాద్ జిల్లా మే30 (ప్రజాపాలన,ప్రతినిధి) : ఓటర్ జాబితా ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్ర ప్రాముఖ్యమైనదని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం తో కలిసి రెండవ ఓటరు జాబితా సవరణపై వివిధ పార్టీల ప్రతినిధులు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండో ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలు రాజకీయ పార్టీల పాత్ర ప్రాముఖ్యంగా ఉంటుందని తెలిపారు ఈనెల 25వ తేదీ నుండి జూన్ 23 వరకు బిఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ నమోదు ప్రక్రియ చేపడతారని తెలిపారు. ఇదే సందర్భంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఓటరు జాబితా తయారీలో ప్రత్యేక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న ఓటర్లను గుర్తించి దగ్గర్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో వారి పేరు నమోదు కోసం అవసరమైన దరఖాస్తును సమర్పించేలా రాజకీయ పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సెప్టెంబర్ నెలలో రెండు శనివారాలు, రెండు ఆదివారాలు ఓటరు ప్రక్రియ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో పార్టీలో ప్రతినిధులు పూర్తిస్థాయిలో సహకరించి నాణ్యమైన ఓటర్ జాబితా తయారయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపర్డెంట్ ప్రమోద్, ఎలక్షన్ డిటి జితేందర్, అన్ని పార్టీల ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చలో కొత్తగూడెం, సిపిఐ ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయండి



చేవెళ్ల మే30,( ప్రజా పాలన):చేవెళ్ల మండల కేంద్రంలోని భూ పోరాట కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే రామస్వామి హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఐ ప్రజా గర్జన భారీ బహిరంగ సభ వచ్చేనెల 4వ తేదీన కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఉంటుందని,ఈ మహాసభకు కార్యకర్తలు కార్మికులు కర్షకులు రైతులు ప్రజాసంఘాల నాయకులు వేల సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలోని రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారము సింగరేణి తదితర ప్రభుత్వ రంగ పరిశ్రమల రాజ్యాంగ లౌకిక వ్యవస్థల పరిరక్షణకై భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈ భారీ బహిరంగ సభ జరుగుతుందని ఈ మహాసభకు సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ డి రాజా గారు హాజరవుతున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు అదేవిధంగా 107 రోజులుగా భూ పోరాట కేంద్రంలో ఇల్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకొని ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కరెంటు లేకుండా నీళ్లు లేకున్నా మొక్కవోని ధైర్యంతో ఉన్న గుడిసె వాసులకు అండగా భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్లవేళలా ఉంటుందని భూ పోరాట కేంద్రంలో అధికారులు ఎమ్మెల్యే చొరవ తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి మైనా బాద్ మండల కార్యదర్శి కే.శ్రీనివాస్ గండిపేట్ మండల కార్యదర్శి బాబురావు బి ఓ సి మండల కార్యదర్శి శ్రీను మహిళా సమాఖ్య నాయకురాలు సాయిల్ అమ్మ మాధవి విజయమ్మ అమృత తదితరులు పాల్గొన్నారు

## షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన ముంగి శ్రీను కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



మధిర మే 30 ప్రజాపాలన ప్రతినిధి: మధిర పట్టణంలో రామనాథం హాస్పటల్ వెనకాల రాత్రి సమయంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ వల్ల లిముంగి శీనులి ఇల్లు కాలిపోయింది మధిర మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం దగ్ధమైన ఇంటిని పరిశీలించి, ముంగి శీను కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ముంగి శీను ఇల్లు కాలిపోవడానికి ప్రభుత్వం నిర్లక్ష్యంమే కారణం అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని చెప్పి ఇల్లు ఇవ్వకుండా పేదలను ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పేదలకు, నిలువలు నీడలేని వారికి ఇల్లు మంజూరు చేయాలని. ముంగి శీను కుటుంబానికి ప్రభుత్వం తరఫున తక్షణమే ఇల్లు మంజూరు చేసి ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసురంశెట్టి కిషోర్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిమిరియాల వెంకటరమణ గుప్తాలి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లిదారా బాలరాజులి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లితూమాటి నవీన్ రెడ్డిలి కాంగ్రెస్ నాయకులు లికర్నాటి రామారావు, పారుపల్లి విజయ్ కుమార్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బిట్ర ఉద్దండయ్య, మాగం ప్రసాద్, ఆదిమూలం శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట షెడ్యూల్ మార్చాలి: ఎం.ఏ.ఖాద్రీ



శంకరపట్నం మే 30 ప్రజాపాలన రిపోర్టర్: రాష్ట్రంలో కొద్ది రోజులుగా ఎండలు భగభగ మండుతున్నా వేసవి సెలవులు ముగియకుండానే, ప్రభుత్వం జూన్ 3వ తేది నుంచి బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించదలుచడం సరికాదని వెంటనే బడిబాట షెడ్యూల్ ను మార్చాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఖాద్రీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించదలచిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు తప్పకుండా నిర్వహించి విజయవంతం చేస్తారని ఐతే జూన్ 12 వ తేది నుంచి ఈ కార్యక్రమం చేపట్టినట్లైతే ఉపాధ్యాయులందరు సంతోషంగా నిర్వహిస్తారని ప్రభుత్వం తక్షణవే ఇట్టి విషయంలో పునరాలోచించాలని అన్నారు. ఈసారి భానుడి ప్రతాపానికి జనం ఇంటి నుంచి బయటకు వెల్లడంలేదని ఈ విషయం రోజు రోజుకు వివిధ ప్రసారమాధ్యమాల ద్వారా తెలుస్తున్నందున ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ఉపాధ్యాయలోకం వెనుకడుగు వేసే ప్రసక్తే ఉండదని ఐతే ఎండల వలన వడదెబ్బకు గురి అయ్యే అవకాశాలు ఉన్నందున జూన్ 12వ తేది నుంచి నిర్వహించే షెడ్యూల్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులుగా కోన నరసింహారావునే కొనసాగించాలి: మధిర బిజెపి నాయకులు



మధిర మే 30 ప్రజా పాలన ప్రతినిధి: జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులుగా కోన నరసింహారావుని తప్పించలేదని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యునిగా కోన నరసింహారావు కొనసాగుతారని తెలిపారు. ఈ సమావేశంలో మధిర పట్టణ బిజెపి అధ్యక్షులు పాపట్ల రమేష్, జిల్లా అధికారి ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, బిజెపి జిల్లా కార్యదర్శి ఛిలువేరు సాంబశివరావు, ఖమ్మం జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు కుంచం కృష్ణారావు, గుంజి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ జోన్ కమిటీ సన్నాహక సమావేశం



బోనకల్ , మే 30 ప్రజా పాలన ప్రతినిధి:మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయం నందు బోనకల్ రావినూతల గ్రామాల జోన్ కమిటీ సన్నాహ సమావేశం మంగళవారం మంద వీరభద్రం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు జాతీయ నాయకులు సాయిబాబా ,సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరావు, మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ పాలడుగు భాస్కరరావు ,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జాతీయ రాజకీయాల గురించి చర్చించి రాబోయే ఎన్నికల గురించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలనీ చర్చించారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు, మండల కమిటీ సభ్యులు గుగులోతు పంతు ,గుగులోతు నరేష్ ,తెల్లాకుల శ్రీనివాస్ ,పార్టీ సభ్యులు బిల్లా విశ్వనాథం ,ఉప్పర శ్రీను, భూక్య జాలు ,డాక్టర్ గోపి, దొండపాటి సత్యనారాయణ, మచ్చ గురవయ్య ,ఏసు పోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కనీళ్ళు పట్టని ప్రభుత్వం

**మధిరలో ప్రచార అర్బాటం కోసమే కొనుగోళ్ల కేంద్రాలు**



మధిర మే 30 ప్రజా పాలన ప్రతినిధి: మధిరలో మంగళవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి మార్కెట్ యార్డ్ లో ఉన్న మొక్కజొన్నలు పూర్తిగా తడిసి నీటిలో తెలియడుతున్నాయి, బీజేపీ నాయకులు ముందు రైతులు తమ గోడు వెళ్ళబోసు కున్నారు.తమ పంట తెచ్చి రోజులు గడుస్తున్న తేమ శాతం పేరుతొ పనిచెయాన్ని యాత్రలతో చూసి మోసం చేస్తున్నారని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేయటం జరిగింది.బీజేపీ నాయకులు మాట్లాడుతు, ప్రభుత్వమే తడిసిన మొక్కజొన్నలు, మొత్తం మద్దతు ధరకుతక్షణమే కొనుగోలు చేయాలి అని,రైతులను నష్టపర్చే ప్రయత్నం చేస్తే, రైతుల పక్షాన పోరాటం చేయటానికి బీజేపీ నాయకులు ఎప్పుడు ముందు ఉంటారు అని ప్రభుత్వన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, లిఏలూరి నాగేశ్వరరావులి, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు, లిపాపట్ల రమేష్లి, జిల్లా కార్యవర్గ సభ్యులు, లికుంచం కృష్ణారావు, మర్యకట్ల స్వర్ణకర్లి, యువమోర్చ అధ్యక్షులు లికుక్కల రాము, రమేష్, రవిచంద్లి, తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా శాంతి నిలయంలో అన్నదానం

**అన్నదానం నిర్వహించిన కాలసాని కుటుంబ సభ్యులు**





బోనకల్, మే 30 ప్రజాపాలన ప్రతినిధి: పుట్టినరోజు సందర్భంగా 108 సిబ్బంది కాలసాని వెంకటరావు- భవాని దంపతుల ఏకైక కుమారుడు కాలసాని వశిష్ట మొదటి పుట్టినరోజును మండల కేంద్రంలోని శాంతి నిలయం లో జరుపుకున్నారు. మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని కాలసాని బాబు- సులోచన దంపతులు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు.. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, కాలసాని పరుశురాం- భార్గవి, కాలసాని నాగేశ్వరావు- భవాని దంపతులు వారి పిల్లలు పాల్గొన్నారు.

# అలాంటి స్టోరీతో 'బిచ్చగాడు 3'

కొంత కాలంగా ఇండియా వ్యాప్తంగా ఉన్న అన్ని ఇండస్ట్రీల్లోనూ సీక్వెల్ మూవీల హడావిడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇలా ఇప్పటికే చాలా చిత్రాలు వచ్చి భారీ విజయాలను సొంతం చేసుకున్నాయి. దీంతో ఫిల్మ్ మేకర్లు హీరోలు ఈ దిశగా అడుగులు వేస్తున్నారు. దక్షిణాది మొత్తంలో ఇప్పుడు హైలైట్ అవుతోన్న ఫ్రాంచైజీలలో విజయ్ ఆంటోనీ 'బిచ్చగాడు' ఒకటి. 2016లో విజయ్ ఆంటోనీ 'బిచ్చగాడు' అనే సినిమాను చేశాడు. ఇది తెలుగు తమిళ భాషల్లో విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ ఊపులోనే ఇప్పుడు ఆ సినిమాకు కొనసాగింపుగా 'బిచ్చగాడు 2' అనే చిత్రం వచ్చింది. మొదటి దానికి శశి డైరెక్షన్ చేయగా.. రెండో దాన్ని విజయ్ ఆంటోనీనే తెరకెక్కించాడు. ఈ మూవీ కూడా ఘన విజయాన్ని అందుకుంది. వరుసగా రెండు భాగాలూ సూపర్ డూపర్ హిట్ అవడంతో 'బిచ్చగాడు' సిరీస్లో మరో సినిమాను తీసుకు రాబోతున్నట్లు విజయ్ ఆంటోనీ ఇటీవలే స్వయంగా ప్రకటించాడు. త్వరలోనే 'బిచ్చగాడు 3' వస్తుందని దానికి కూడా తానే దర్శకత్వం చేస్తున్నానని వెల్లడించాడు. దీంతో ఈ ప్రాజెక్టుపై అటు తమిళంలోనూ ఇటు తెలుగులోనూ అప్పుడే అంచనాలు ఏర్పడ్డాయి. 'బిచ్చగాడు 3' మూవీపై నెలకొన్న హైప్ వల్ల అప్పుడే దీని గురించి ఎన్నో రకాల వార్తలు వైరల్ అవుతోన్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమా బ్యాగ్రౌండ్ వివరాలు లీక్ అయ్యాయి. దీని ప్రకారం.. ఈ చిత్రం 'బ్రదర్ సెంటిమెంట్'తో తెరకెక్కబోతున్నట్లు తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన డైలాగ్ వెర్షన్తో కూడిన స్క్రిప్టు వర్క్ కూడా పూర్తైందని ఫిలిం నగర్ సమాచారం. 'బిచ్చగాడు' మూవీలో తల్లి సెంటిమెంట్ను హైలైట్ చేసి చూపించారు. ఇటీవల వచ్చిన 'బిచ్చగాడు 2' సినిమా బ్రదర్ అండ్ సిస్టర్ సెంటిమెంట్తో వచ్చింది. ఈ రెండూ భారీ హిట్లు అవడంతో ఇప్పుడు అదే పంథాలో వెళ్తూ.. 'బ్రదర్' సెంటిమెంట్తో రాబోతున్నారట. ఈ సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం అవుతుందని తెలిసింది. దీన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసుకుని 2025లో రిలీజ్ చేస్తారనే టాక్ వినిపిస్తోంది.




## మహేష్ మాస్ స్ట్రైక్ కి టైం ఫిక్స్.!




మన టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా పూజా హెగ్డే మరియు శ్రీ లీల హీరోయిన్ గా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న చిత్రం కోసం తెలిసిందే. భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రం నుంచి ఇప్పుడు ఒకో అప్డేట్ కూడా సాలిడ్ హైప్ ని అయితే తీసుకొస్తుండగా ఇప్పుడు సూపర్ స్టార్ ఫ్యాన్స్ అంతా కూడా మహేష్ మాస్ స్ట్రైక్ కోసం అయితే ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక దీనిపై అయితే లేటెస్ట్ గా మేకర్స్ సాలిడ్ అప్డేట్ ని అందించారు. మరి ఈ మాస్ గ్లింప్స్ సహా టైటిల్ ని అయితే స్వర్గీయ సూపర్ స్టార్ కృష్ణ గారి ఐకానిక్ చిత్రం "మోసగాళ్లకు మోసగాడు" రీ రిలీజ్ తో అయితే కన్ఫర్మ్ చేయగా ఇప్పుడు దీనికి టైం ని అనౌన్స్ చేసేసారు. మరి ఈ సినిమాతో సాయంత్రం 6 గంటల 3 నిమిషాలకి అయితే థియేటర్స్ లో మహేష్ మాస్ బ్లాస్ట్ పేలనున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. మరి రేపు హంగామా ఏ లెవెల్లో ఉంటుందో చూడాలి.


## "ఆదిపురుష్" ఆల్బమ్ తో మరింత హైప్.!




ఇప్పుడు పాన్ ఇండియా సినిమా వీక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారీ చిత్రం "ఆదిపురుష్". పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు ఓంరౌత్ తెరకెక్కించిన ఈ సెన్సేషనల్ ప్రాజెక్ట్ భారీ విజువల్స్ తో ఇపుడు నెక్స్ట్ లెవెల్ హైప్ తో అయితే వస్తుంది. మరి ఇదిలా ఉండగా ఈ భారీ చిత్రం రిలీజ్ కి దగ్గర అవుతుండగా మేకర్స్ ఒకో సాంగ్ ని కూడా రిలీజ్ చేస్తున్నారు. అయితే రీసెంట్ టైం లో ఓ సినిమాకి కావాల్సిన సెన్సేషనల్ చార్ట్ బస్టర్ ఆల్బమ్ అయితే ఇపుడు ఆదిపురుష్ లో కూడా ఉన్నట్టు అనిపిస్తుంది. మొదటి సాంగ్ జై శ్రీరామ్ బిగ్గెస్ట్ హిట్ కాగా లేటెస్ట్ గా వచ్చిన రాం సీతా రాం సాంగ్ కూడా యునానిమస్ గా సూపర్ రెస్పాన్స్ ని అయితే తెచ్చుకుంది. దీనితో ఈ చిత్రం ఆల్బమ్ కూడా సినిమాలో బిగ్గెస్ట్ ప్లస్ కానుంది అని అనిపిస్తుంది. అలాగే ఈ సినిమాలో అయితే టోటల్ గ 5 పాటలు ఉన్నట్టు టాక్ ఉండగా మిగతావి కూడా ఎలా ఉంటాయో చూడాలి. అవి కూడా బాగున్నట్టు అయితే ఆదిపురుష్ మ్యూజికల్ గా కూడా భారీ హిట్ అని చెప్పొచ్చు.

## 44 ఏళ్ల వయసులో మార్షల్ ఆర్ట్స్ సాధ్యమేనా సిద్దార్ధ్?

మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ అన్నది చిన్న వయసు నుంచే అలవాటు చేసుకోవాలి. ఆ యవసులో కాళు .. చేతులు..వాటి తాలుకా కీళ్లు లేతగా ఉండటంతో అనుగుణంగా వంగడానికి వీలు ఉంటుంది. అది ఎంతో కఠోరమైన శిక్షణ. మనసు లగ్నంతో పాటు..మనిషి ఎంతో దృష్టి సారిస్తే తప్ప! సాధ్యం కాని విద్య అది. పవన్ కళ్యాణ్ లాంటి హీరో కూడా మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ తీసుకున్నవారే. చిన్న వయసులోనే పవన్ కి ఈ విద్యపై ఆసక్తి ఉండటంతో! ప్రత్యేకంగా ట్రైనింగ్ తీసుకుని అందులో టెక్నిక్ లు నేర్చుకున్నాడు. ఇది పూర్తిగా సెల్ఫ్ డిఫెన్స్ కి ఎంతగానో ఉపయోగ పడే విద్యగా భావిస్తారు. అయితే 44 ఏళ్ల వయసులో నటుడు సిద్దార్ధ్ కూడా మార్షల్ ఆర్ట్స్ లో ట్రైనింగ్ తీసుకున్నట్లు వెల్లడించారు.



ప్రస్తుతం ఆయన హీరోగా 'టక్కర్' అనే సినిమా తెరకెక్కుతోంది. కార్తీక్ జి. క్రిష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు..తమిళ్ లో ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సినిమా ప్రమోషన్ లో భాగంగా సిద్దార్ధ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నట్లు తెలిపాడు. ఇప్పటివరకూ తనని లవర్ బోయ్ గా..చాక్లెట్ బోయ్ గానే తెరపై చూసారని..తొలిసారి యాక్షన్ హీరోగా చూస్తారని..ఈ సినిమా ఒక డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ అన్నారు. 'ఇప్పటికే ఓ ప్రత్యేకమైన జోనర్ సినిమాలే చేసాను. ఒక పాత్ర ఇస్తే ఆరంభం నుంచి చివరి దాకా సిద్దార్ధ్ లా కాకుండా ఒక పాత్రలాగే కనిపించేలా నటించా. ఈక్రమంలో నువ్వు ఎందుకు కమర్శియల్ సినిమాలు చేయడం లేదని అడిగారు. ఆ ప్రశ్నకు సమాధానం టక్కర్ ఇస్తుంది. తొలిసారి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. అందుకోసం ప్రత్యేకమైన శిక్షణ తీసుకున్నా. కండలు పెంచాను. భారీ పోరాట సన్నివేశాల్లో నటించాను. కొత్త తరానికి నచ్చేలా ఓ మంచి ప్రేమ కథ కూడా ఉంది. మొత్తంగా సినిమాలో కొత్త సిద్దార్ధ్ ని చూస్తారని ధీమా వ్యక్తం చేసారు. అయితే సిద్దార్ధ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వెనుక నెటి జనులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 44 ఏళ్ల వయసులో ఈ విద్య ఎలా సాధ్యమంటూ కామెంట్లు పోస్ట్ చేస్తారు.

## గ్లోబల్ స్టార్ చరణ్ కి పాన్ ఇండియా ప్రొడ్యూసర్ స్పెషల్ థాంక్స్.!

రీసెంట్ గానే మన టాలీవుడ్ గ్లోబల్ మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తన సరికొత్త ప్రొడక్షన్ హౌస్ ని అయితే స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. యూవీ నిర్మాతల్లో ఒకరైన విక్రమ్ తో కలిసి స్టార్ట్ చేసిన వి మెగా ప్రొడక్షన్ హౌస్ అయ్యితే తమ మొదటి సినిమానే ప్రైడ్ ఇండియన్ సబ్జెక్టు "ది ఇండియన్ హౌస్" ని స్టార్ట్ చేశారు. మరి ఈ సినిమా అయితే ప్రముఖ నిర్మాత అభిషేక్ అగర్వాల్ నిర్మాణ సంస్థ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్ తో అయితే కొలాబరేట్ అయ్యి అనౌన్స్ చేశారు. మరి ఈ అంశంపై అయ్యితే లేటెస్ట్ గా పాన్ ఇండియా సినిమా దగ్గర కాశ్మీర్ ఫైల్స్, కార్తికేయ 2 లాంటి భారీ హిట్స్ ఇచ్చిన ఏఈ ప్రొడ్యూసర్ చరణ్ ని స్పెషల్ థాంక్స్ చేస్తూ ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. మొదటగా తనని తన సినిమాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేసారు. తనది సినిమా బ్యాక్ డ్రాప్ కాకపోయినప్పటికీ నిర్మాతగా నన్ను ఎంతగానో వారు ఆదరించారని తెలిపారు. ఇక మా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ గారు అయితే నన్ను నమ్మి ఈ సినిమాకి నన్ను కూడా భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందని. ఖచ్చితంగా ఇండియన్ హౌస్ చిత్రం మంచిపోలేని ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు. అలాగే ఒక ప్రైడ్ ఇండియన్ గా మన దేశపు సంస్కృతిని, చరిత్ర విషయంలో ఎంతో గర్వంగా ఉన్నానని మరింతమంది కొత్త టాలెంట్ ని పరిచయం చేస్తూ ఇండియన్ సినిమాని గ్లోబల్ వైడ్ గా తీసుకెళ్తానని తెలిపారు.



## ఆర్. పి పట్నాయక్ సెకెండ్ ఇన్నింగ్స్ ఎలా ఉంటుందో?



ఆర్ . పి పట్నాయక్ మ్యూజిక్ సెన్సేషన్ గురించి చెప్పాల్సి న పనిలేదు. దాదాపు రెండు దశాబ్దాల ప్రయాణం లో ఎన్నో మ్యూజికల్ హిట్స్ అందించారు. మరెన్నో క్లాస్..మాస్ బీట్స్ తో శ్రోతల్ని అలరించారు. సంగీత దర్శకుడిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. 'నీకోసం' నుంచి 'మనలో ఒకడు' వరకూ ఆర్ పీ ట్యూన్ వినిపిస్తూనే ఉంది. అయితే ఐదారేళ్లగా ఆర్ . పీ సంగీతానికి దూరంగా ఉన్నారు. అలాగని మళ్లీ దర్శకుడిగానో..నటుడిగానో బిజీ అవ్వలేదు. సంగీతానికి తనకు తానుగానే విరామం ఇచ్చారు. ఈ విరామం తనకు తానుగానే తీసుకున్నారా? లేక అవకాశాలు లేక ఖాళీగా ఉన్నారా? అని రకరకాల సందేహాలుండేవి. తాజాగా మళ్లీ 'అహింస' సినిమాతో కంబ్యాక్ అవుతున్న సంగతి తెలిసిందే. తేజ దర్శకత్వం వహించిన సినిమా తో ఆర్ పీ మళ్లీ తన ట్యూన్ మార్కెట్ లోకి తీసుకొస్తున్నారు. త్వరలో సినిమా రిలీజ్ నేపథ్యంలో ఆర్ పీ పలు విషయాలు పంచుకున్నారు. ఆ వేంటో ఆయన మాటల్లోనే.. సంగీతం చేయమని చాలా మంది అవకాశాలిచ్చారు. కానీ చేయాలనిపించలేదు. ఏదైనా కథనచ్చితేనే చేస్తాను. లేకపోతే చేయాలనిపించదు. కానీ నా చేతిలో సినిమా ఉన్నా... లేకపోయినా రోజు 18 గంటలు పని చేయడం అలవాటు. ప్రస్తుతం కన్నడలో కొన్ని సినిమాలు చేస్తున్నా. దర్శకుడి కథలు సిద్దం చేస్తున్నా. నేను ఎన్ని చేసినా సంగీతమే ఎక్కువ పేరు తీసుకొచ్చింది. అంతా నన్ను సంగీత దర్శకుడిగానే చూస్తారు. ఓ సందర్భంలో మళ్లీ సంగీతం చేయనని చెప్పి మానేసాను. కానీ ఓ సందర్భంలో బాలుగారు మళ్లీ సంగీతం ఎప్పుడు మొదలు పెడుతున్నావ్ అని అడిగారు. ఆయనకు చేస్తాను గురువు గారు అని చెప్పేవాడిని. ఆయన వెళ్లిపోయాక ఆయనకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయాను అనిపించింది. బాలు పాటపై ఉన్న అభిమానంతో సినిమాల్లోకి వచ్చా. ఈ నేపథ్యంలో తేజ గారిని కలిసాక మళ్లీ సంగీతం చేయాలి. అది బాలు గారి కోరిక అని చెప్పా. ఆ తర్వాత కొన్నాళ్లకి తేజ ఫోన్ చేసి 'చిత్రం–2' చేస్తున్నామని చెప్పారు. ఆ ప్రాజెక్ట్ స్థానంలోనే 'అహింస' వచ్చింది. కథకు తగ్గట్టు మంచి పాటలు కుదిరాయి. అహింస సిద్ధాంతాన్ని నమ్మే ఓ అబ్బాయి కథ ఇది' అని అన్నారు.

మాస్టర్ కీ TV
Jai B Bhoomi News Channel Limited
CIN NO: U74999TG2018PLC128263

మాస్టర్ కి టీవీ ఛానల్ లో డైరెక్టర్స్ ని
ఈ క్రింది విభాగాల నుంచి తీసుకొనబడును

1. ప్రతి కులం నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
2. ఒక్కొక్క డిపార్ట్ మెంట్ నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
3. సమస్యల గురించి పోరాడే ఒక్కొక్క సోషల్ విభాగం నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
4. మైనార్టీస్, ముస్లిం, క్రిస్టియన్, బుద్ధిస్ట్ మొదలగు వారి నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
5. అభ్యుదయ వాదుల నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
6. ఒక్కొక్క పార్లమెంట్ నుంచి లేక జిల్లా నుంచి ఒక్కొక్క స్టాఫ్ రిపోర్టర్ ని తీసుకొనబడును.
7. మహిళలు & N.G.O ల నుండి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
8. యూత్ సంఘాల నాయకులను ఒక్కరు లేక అంతకుమించి ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
9. కార్మిక సంఘాల నాయకులను ఒక్కరు లేక అంతకుమించి నాయకులను తీసుకొనబడును.

ఇంకా మీకు తెలిసిన విభాగాలను తెలియపరచగలరు

డాక్టర్ కె.శివ భాగ్యారావు బహుజన్, IRS-vrs
చైర్మన్ మాస్టర్‌కీ టీవీ ఛానల్
(జై బి భూమి న్యూస్ ఛానల్ లిమిటెడ్)

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989